RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 193 మేడ్చల్ మల్కాజ్‌గిరి 4 ఆగష్టు 2024 ఆదివారం పేజీలు : 4

## ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపండి : మోదీ

న్యూఢిల్లీ : జమ్మూకశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని మోదీ సమీక్ష నిర్వహించారు. అక్కడ వరుసగా ఉగ్రదాడులు జరుగుతున్న నేపథ్యంలో ఆయన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమ య్యారు. జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాల మోహరింపు, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో కూడా మాట్లా డినట్లు ప్రభుత్వవర్గాలు తెలిపాయి. ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపాలని మోదీ ఆదేశించినట్లు వెల్లడించాయి. పూర్తిస్థాయి సామర్థ్యాలను వినియోగించుకొని ఉగ్రవాదులను అణచివేయాలని పేర్కొన్నట్లు తెలిపాయి. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో కూడా ప్రధాని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు.




# సీఎం రేవంత్‌కు షాక్..!

## బీఆర్ఎస్‌లోకి మరో 6 ఎమ్మెల్యేలు?

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీకి సీన్ రివర్స్ అవుతోంది. కాంగ్రెస్ లో చేరిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గోడకు కొట్టిన బంతిలా తిరిగి మళ్ళీ బీఆర్ఎస్ లోకే వచ్చారు. ఇంకొంతమంది అలాగే తిరిగి వస్తారన్న ప్రచారంలో భాగంగా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పేరు తెరపైకి వచ్చింది. నిప్పు లేనిదే పొగ రాదు అన్నట్లు అసెంబ్లీ సమావేశాల సమయంలో ఛాంబర్ కు వెళ్లి మరీ కేటీఆర్ తో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలను కలిశారు తెల్లం. బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మనసు మార్చుకున్నానని కలిసి వెళ్లిన వెంటనే తెల్లం వెంకట్రావు కూడా బీఆర్ఎస్ నేతలను కలవడం చర్చనీయాంశం అయ్యింది. కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్యేలను ఇంకొందరు యూటర్న్ తీసుకుంటారని తెలుస్తోంది. తెల్లం వెంకట్రావు కూడా తిరిగి వస్తారని అంటున్నాయి బీఆర్ఎస్ పార్టీవర్గాలు. తెల్లం వెంకట్రావు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు భద్రాచలం కాంగ్రెస్ టికెట్ కోసం ఆయన గట్టి ప్రయత్నాలు చేశారు. అయితే కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే వీరయ్య ఉండటంతో అతడిని కాదని టికెట్ ఇవ్వడం కుదరదని చెప్పేసింది కాంగ్రెస్ అధిష్టానం. దీంతో బీఆర్ఎస్ నేతలతో మంతనాలు జరిపి టికెట్ హామీతో గులాబీ కండువా కప్పుకున్నారు తెల్లం వెంకట్రావు. భద్రాచలం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటే బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే వెంకట్రావు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి చొరవతో పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ గూటిలోకి చేరారు తెల్లం వెంకట్రావు. నియోజకవర్గ అభ్యర్థి కోసమే పార్టీ మారానని చెప్పుకున్నారు భద్రాచలం ఎమ్మెల్యే. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో తెల్లం వెంకట్రావు కేటీఆర్ ఛాంబర్ కు వెళ్లి వారిని కలవడం.... ఆ ఫోటో బయటకు రావడంతో మళ్లీ బీఆర్ఎస్ లోకి వెళుతున్నారని ప్రచారం మొదలైంది. అయితే వెంకట్రావు ఎక్కడికి వెళ్లరని.... పాత పరిచయం కాబట్టి బీఆర్ఎస్ నేతలను కలిసారని అంటున్నారు మంత్రి పొంగులేటి. తమ పార్టీలోకి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని అంటున్నారు. ఎవరు ఎక్కడికి వెళ్లరని అంటున్నారు పొంగులేటి. బీఆర్ఎస్ లో కొందరు అల్పసంతోషికులు ఉన్నారు. నా ఫోటో తీసేసి పార్టీ మారతారని ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కూడా ఖండించారు. చాలామంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ మంత్రుల ఛాంబర్ లోకి వచ్చి కలుస్తున్నారని వారంతా పార్టీ మారేవారైనా అని వెంకట్రావు ప్రశ్నిస్తున్నారు. కండువా మార్చాక మాట తప్పను.... మడమ తిప్పనని తెల్లం వెంకట్రావు చెప్తున్నా ప్రచారం మాత్రం ఆగలేదు. అధికార పార్టీలో ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని అంటున్నారు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు. భద్రాచలంలో ఇచ్చిన హామీలు నెరవేరాలంటే ప్రభుత్వ సహకారం తప్పనిసరని.... అందుకే కాంగ్రెస్ లో చేరి నిధులు సాధించి పనులు ప్రారంభించారని అంటున్నారు తెల్లం వెంకట్రావు. ఏది ఏమైనా ఒక్కసారి కలిసినందుకే రాజకీయంగా సంచలనంగా మారి చర్చకు దారితీసింది. దీంతో తెల్లం, అరికపూడీగాంధీ, ప్రకాష్, కాలే యాదయ్య, పోచారం, సంజయ్‌కుమార్ మళ్లీ ఘర్ వాపస్ రానున్నారట.



## రాహుల్.. అశోక్‌నగర్ వచ్చి మీ హామీని ఎలా నిలబెట్టుకుంటారో యువతకు చెప్పండి: కేటీఆర్

హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి విమర్శనాస్త్రాలు సంధించారు. రాహుల్ గాంధీ జీ.. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న మీ మాటలు నమ్మి తెలంగాణ యువత కాంగ్రెస్‌కు ఓటేశారు. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలైనా ఇప్పటివరకు ఇచ్చిన ఉద్యోగాలు సున్నా. ఎన్ని ఉద్యోగాలో చెప్పకుండా జాబ్‌లెస్ క్యాలెండర్ ఇచ్చారు. మరోసారి హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌కు వచ్చి యువతను కలిసి మీ హామీని ఎలా నిలబెట్టుకుంటారో చెప్పండి?.. అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ.. అశోక్‌నగర్‌కు వచ్చి యువతతో మాట్లాడుతున్న వీడియోను షేర్ చేశారు. కాగా, శుక్రవారం రేవంత్ రెడ్డి సర్కార్ అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. పోస్టుల సంఖ్య లేకుండా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గన్‌పార్క్ వద్ద నిరసనకు దిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'తొమ్మిది నెలల కిందట ఉద్యోగాల పేరిట ఎంత డ్రామా చేసిండ్రు..కేసీఆర్ అసలు ఉద్యోగాలే ఇవ్వలేదన్నట్టు తప్పుడు ప్రచారం చేసిండ్రు. అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలని పత్రికల్లో ఊదరగొట్టే విధంగా అక్రమ సంపాదనతో కాంగ్రెస్ నాయకులు ప్రకటనలిచ్చిండ్రు. రాహుల్ గాంధీని అడుగుతున్న, నువ్వు ప్రామిస్ చేసిన రెండు లక్షల ఉద్యోగాలేవీ?' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు.

# కోదండరాం సారు మంత్రి అవుతారా?

## మండలికి గవర్నర్ కోటాలో ప్రతిపాదన



హైదరాబాద్ : దేశంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం పది రాష్ట్రాలకు గవర్నర్ లను నియమించింది. వీరిలో ఆరు రాష్ట్రాలకు పూర్తిగా కొత్త గవర్నర్లు కాగా.. మరో నాలుగు రాష్ట్రాలకు ఇంచార్జి గవర్నర్ల స్థానంలో నియామకం చేపట్టింది. ఇందులో భాగంగా తెలంగాణ గవర్నర్ గా త్రిపుర మాజీ డిప్యూటీ సీఎం జిష్ణుదేవ్ వర్మ నియమితులయ్యారు. ఈయన రాజ కుటుంబానికి చెందినవారు. మరోవైపు ఇప్పటివరకు ఇంచార్జి గవర్నర్ గా ఉన్న సీపీ రాధాక్రిష్ణన్ మహారాష్ట్రకు పూర్తి స్థాయి గవర్నర్ గా వెళ్లారు. లోక్ సభ ఎన్నికల ముందు వరకు తెలంగాణ గవర్నర్ గా తమిళిసై వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఆమె ఎన్నికల్లో పోటీకి సిద్ధపడడంతో రాధాక్రిష్ణన్ ను నియమించారు.

**ఆ కోటాలో వీరికే చోటు..** తెలంగాణలో తమిళిసై గవర్నర్ గా ఉన్న సమయంలో శాసనమండలి పదవుల భర్తీపై అప్పటి బీఆర్ఎస్ సర్కారుతో విభేదించారు. నాటి కేసీఆర్ సర్కారు సామాజిక సేవ కోటాలో ప్రతిపాదించిన పేర్లను తిరస్కరించారు. దీంతో ఆ నియామకాలు అలానే నిలిచిపోయాయి. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ఎవరిని ప్రతిపాదిస్తారనే ఆసక్తి నెలకొంది. దీనికితగ్గట్లే తెలంగాణ ఉద్యమకారుడు ప్రొఫెసర్ కోదండరాం, సియాసత్ పత్రిక అధిపతి ఆమీర్ అలీఖాన్ పేర్లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా పంపింది. అయితే, దీనిపై ప్రతిపక్ష బీఆర్ఎస్ హైకోర్టుకు వెళ్లింది. ఈ నేపథ్యంలో కొత్తగా ఇద్దరి పేర్లను క్యాబినెట్ తీర్మానించి గవర్నర్ కు పంపవచ్చని హైకోర్టు పేర్కొంది. కాగా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరోసారి కోదండరాం, ఆమీర్ అలీఖాన్ పేర్లనే పంపనున్నట్లు సమాచారం.

**కొత్త గవర్నర్ ఆమోదం ఖాయమేనా? :** కొత్త గవర్నర్ గా వచ్చిన జిష్ణుదేవ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన బాధ్యతలు చేపట్టాక తొలి నిర్ణయం గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపైనే ఉంటుందా? అనే చర్చ మొదలైంది. ఎందుకంటే.. కేబినెట్ సమావేశంలో కోదండరాం, ఆమీర్ అలీఖాన్ పేర్లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించే అవకాశం ఉందని భావిస్తున్నారు. హైకోర్టు సూచన, ప్రభుత్వ నిర్ణయం, కొత్త గవర్నర్ నేపథ్యంలో ఎమ్మెల్సీల నియామకానికి ఆమోదం పడినట్లేనని భావిస్తున్నారు.

**కోదండరాం సారు మంత్రి అవుతారా? :** తెలంగాణ మలి దశ ఉద్యమంలో కోదండరాం పాత్ర విస్మరించలేనిది. అయితే, కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక మాత్రం ఆయనను కనీసం దగ్గరకు తీయలేదు. దీంతోనే కాంగ్రెస్ కు దగ్గరయ్యారు. గత ఏడాది ఎన్నికల్లో మద్దతు ప్రకటించారు.

ఇప్పుడు ఆయన ఎమ్మెల్సీ కానుండడంతో మంత్రి పదవి కూడా లభించే చాన్సుందని భావిస్తున్నారు. అదే జరిగితే.. తెలంగాణ ఉద్యమకారులంతా సంతోషిస్తారనే చెప్పాలి.

# శ్రావణ పల్లకీలో విహరిస్తున్న నేతలు..

## రేవంత్ మంత్రి వర్గ విస్తరణలో బెర్తు దక్కేదెవరికి?!




హైదరాబాద్ : శ్రావణ మాసం వస్తోంది. ఆశల పల్లకి తెస్తోంది. తెలంగాణ మంత్రి వర్గ విస్తరణలో బెర్తు దక్కేదెవరికి? మరికొద్ది రోజుల్లో సీట్ న్యూస్ అందుకునేదెవరు? 6 బెర్తుల్లో ఒకటైనా దక్కకపోతుందా అనే ఆలోచనతో లాబీయింగ్ చేసుకుంటున్న ఆశావహులెవరో చూద్దాం. తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై చాలామంది నేతలు ఆశలు పెట్టుకున్నారు. ఆషాఢం ముగిసి శ్రావణ మాసం వస్తుండడంతో..ఉందిలే మంత్రీ కాలం ముందు ముందునా అని పాడుకుంటున్నారు. రేవంత్ కేబినెట్‌లో ఆరు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. నెల రోజుల క్రితమే సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లడం, కాంగ్రెస్ సీనియర్లు కూడా హస్తినకు వెళ్లడంతో.. మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని అప్పట్లో బాగా ప్రచారం జరిగింది. అయితే కూడికలు తీసివేతలు ఓ కొలిక్కి రాలేదో ఏమో గానీ.. ఆషాఢం ఆశలకు ఫుల్ స్టాప్ పడింది. శ్రావణంలో మంత్రి వర్గం విస్తరణ చేద్దాం, అప్పుడే చూద్దాం అని అధిష్టానం చెప్పడంతో ఈ ఆశలకు టెంపరరీగా కామా పడింది. అయితే ఇప్పుడు శ్రావణ మాసం ముంచుకొస్తున్న శుభ ముహూర్తాన ఆశావహుల్లో మళ్లీ కదలిక మొదలైంది. మంత్రివర్గ బెర్తులపై కర్చీఫులు వేయడం మొదలైంది. మొన్న మాదిగ సామాజిక వర్గానికి చెందిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, తుంగతుర్తి ఎమ్మెల్యే శామ్యూల్, మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ, నకిరేకల్ శాసనసభ్యుడు వేముల వీరేశం, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు.

తమ సామాజిక వర్గాన్ని కూడా దృష్టిలో పెట్టుకోండి అంటూ సీఎం దృష్టిలో పడ్డారు. ఇక లేటెస్ట్‌గా ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఎంట్రీ ఇచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 34 అసెంబ్లీ సీట్లలో కాంగ్రెస్ తరఫున గెలిచింది తాను ఒక్కడినే కాబట్టి, మంత్రివర్గం విస్తరణలో తనకు అవకాశం వస్తుందంటున్నారు ఆయన. మూడు సార్లు గెలిచిన సీనియర్ కావడంతో, ఆషాఢం తర్వాత అవకాశం ఉంటుందని ఆయన బోలెడు ఆశలు పెట్టుకున్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా తనకు చాన్స్ ఉంటుందని నమ్ముతున్నారు. దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్.. ఎస్టీ కోటాలో కర్చీఫ్ వేసుకుని కూర్చున్నారు. ఆశావహుల జాబితాలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది.

ఆయనకు గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా ఉంది. చెన్నూరు ఎమ్మెల్యే, మాల సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేత గడ్డం వివేక్ కూడా తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన గతంలో ఎంపీగా కూడా పనిచేశారు. మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి పేరు కూడా గట్టిగానే వినిపిస్తోంది. ముదిరాజ్ సామాజిక వర్గానికి మంత్రి పదవి ఇస్తామని పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ స్వయంగా ప్రకటించడం.. శ్రీహరికి కలిసివచ్చే అంశంగా భావిస్తున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు పేరు కూడా ఆశావహుల జాబితాలో ఉంది. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కూడా తన వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అయితే 6 బెర్తులు ఖాళీగా ఉన్నా ప్రస్తుతం ఐదుగురిని కొత్తగా మంత్రి వర్గంలోకి తీసుకుంటారని, మైనారిటీ కోటాను తర్వాత భర్తీ చేస్తారని చెబుతున్నారు. ఇలా పలువురు ఆశావహులు శ్రావణ పల్లకీలో విహరిస్తున్నారు.

# సంపాదకీయం

## పోరాటానికి వైసీపీ నేతలు సిద్ధంగా లేరా ?

వైసీపీలో నిర్లిప్తత అలా కొనసాగుతోంది. ఆ పార్టీలో సీనియర్ నేతలకు కొదవ లేదు. నలభై మందిదాకా మంత్రులుగా పనిచేశారు. ఇక అనేక మంది వివిధ హోదాలలో పార్టీలో ప్రభుత్వంలో కొనసాగారు. వైసీపీ విపక్షంలోకి వచ్చిన తరువాత వారంతా ఫుల్ సైలెంట్ అయ్యారు. ఎందుకు అంటే దానికి అనేక కారణాలు ఉన్నాయి. ఇవన్నీ వెరసి వారికి వైసీపీ అధినాయకత్వం మీదనే కోపం ఎక్కువగా ఉ ఒదని అంటున్నారు. తాజాగా ఒక వీడియో బైట్ ని విడుదల చేసిన ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అయితే టీడీపీ కూటమికి ఆరు నెలల సమయం ఇవ్వాలని అన్నారు. అపుడే వారి మీద విమర్శలు చేయడం సబబు కాదని కూడా అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలు తీర్చమని కోరడం కూడా తప్పు అన్నట్లుగా మాట్లాడారు. అదే సమయంలో వైసీపీ అధినాయకత్వం చేసిన తప్పులను ఆయన గుర్తు చేశారు. నా ఎస్టీలు నా బీసీలు నా మైనారిటీలు అని జగన్ స్లోగన్ ఇచ్చారని వారు ఓట్లు వేసినా బాగుండేదని అంటూ వారూ వేయలేదు, మరో వైపు చూస్తే ఈ నినాదం వల్ల ఇతర సామాజిక వర్గాలకు నెగిటివ్ అయ్యామని అన్నారు. టికెట్ల ఇష్యూతో సినీ పరిశ్రమకు వ్యతిరేకమయ్యామని చెప్పారు. మద్యం ఇసుక వంటివి ప్రభుత్వమే నిర్వహించడం తప్పు అని ప్రభుత్వం పాలన చేయాలి కానీ వ్యాపారం చేయకూడదు అని చెప్పారు. ఇలా చాలా చెబుతూ ఇప్పట్లో కూటమి మీద పోరాటం అనవసరం అని తేల్చారు. గరిష్టంగా చూస్తే 2024 ఏడాది క్యాలెండర్ ఇయర్ పూర్తి కావాల్సిందే అని కూడా ఒక గడువు పెట్టారు. అప్పటిదాకా కూటమిని చిన్న మాట కూడా అనకూడదని అన్నారు. కేతిరెడ్డి చెప్పిన దాంతో సొంత పార్టీ మీద నిశిత విమర్శలు ఉన్నాయి. అవి సద్విమర్శలుగా కూడా తీసుకోవాల్సి ఉంటుందని అంటున్నారు. ఇంకో వైపు కూటమికి టైం ఇవ్వాలని సూచించడం ఇది కూడా చర్చనీయాంశం అవుతోంది. జగన్ అయితే పదే పదే హామీల విషయం ప్రస్తావిస్తున్నారు. అయితే కేతిరెడ్డి చెప్పిన దానిని బట్టి ఆయన కూడా డిసెంబర్ వరకూ టైం ఇవ్వాలనే సలహా ఉంది. ఇక పోరాటాల విషయమే తీసుకుంటే ఎక్కడికక్కడ వైసీపీ కార్యకర్తల మీద టీడీపీ నేతలు దాడులు చేస్తున్నారు అని చెప్పి ఢిల్లీలో వైసీపీ ధర్నా నిర్వహించింది. ఈ తరహా పోరాటాలు అవసరమా లేదా అన్నది అయితే చర్చగా ఉంది. సొంత పార్టీ క్యాడర్ ఇబ్బందుల్లో ఉన్నపుడు వారిని నేతలు కాపాడుకోవాలి. మరి ఆ విషయంలో కూడా కొంతమంది ఎందుకొచ్చిన పోరాటాలు అనుకుంటే బలి అయ్యేది క్యాడరే. చాలా మంది అయితే సొంత వ్యాపారాలలో బిజీ అయిపోయారు అని అంటున్నారు. ఎన్నికలకు ముందు సరిగ్గా చివరి ఏడాదిలో రాజకీయంగా యాక్టివ్ అయితే సరిపోతుంది అని అనుకుంటున్న వారే ఎక్కువ మంది ఉన్నారు. ప్రస్తుతం కేతిరెడ్డి చెప్పినది సబబు అని చాలా మంది ఏకీభవిస్తున్నారు కూడా. ఈ నేపథ్యంలో వైసీపీలో అంతర్గతంగా నేతల ఆలోచనలు ఎలా ఉన్నాయన్నది చర్చకు వస్తోంది. క్యాడర్ డీ మోరలైజ్ అయింది. లీడర్లు అయితే ఎందుకొచ్చిన పోరాటాలు అని అంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో వైసీపీని కనీసం ఈ ఆరు నెలల పాటు ఉనికి చాటుకునేలా చేయడం ఎలా అన్నది వైసీపీ హైకమాండే ఒక ఆలోచన చేసి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అంటున్నారు.

# ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి...

**సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్**

**సీసీఎల్ఏ కమిషనర్ ఆదేశాల అనుసారం ధరణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించండి....**

**తహసిల్దార్లను ఆదేశించిన జిల్లా కలెక్టర్ గౌతమ్...**





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. ధరణి సమస్యల పరిష్కారానికి నూతన ఆర్.ఓ.ఆర్. బిల్లుపై ప్రజాభిప్రాయ సేకరణ ధరణి పెండింగ్ దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై శనివారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ధరణి సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా రూపొందించిన నూతన ఆర్.ఓ.ఆర్ ముసాయిదా బిల్లు-2024 పై ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు సీసీఎల్ఏ వెబ్సైట్ (%www.ccla.telan gana.gov.in%) ద్వారా అవకాశం కల్పించడం జరిగిందని వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా కమిషనర్ నవీన్ మిట్టల్ వెల్లడించారు. ఈ నెల 2వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఈ ముసాయిదా బిల్లుపై ప్రజలు ఎవరైనా సరే తమ అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయవచ్చని అన్నారు. సలహాలు, సూచనలను ఈ మెయిల్ (%ror2024-rev@telangana.gov.in%) ద్వారా తెలుపవచ్చని సూచించారు. పోస్ట్ ద్వారా కూడా 'ల్యాండ్ లీగల్ సెల్, సీసీఎల్ఏ కార్యాలయం, నాంపల్లి, స్టేషన్ రోడ్, అన్నపూర్ణ హోటల్ ఎదురుగా, ఆబిడ్స్, హైదరాబాద్ 500001' చిరునామాకు పంపించవచ్చని తెలిపారు. అనంతరం ఆయా మండలాల తహశీల్దార్లకు కలెక్టర్ గౌతమ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రణాళికాబద్ధం గా పరిష్కరించాలని, సీ.సీ.ఎల్.ఏ కమిషనర్ సూచనల మేరకు వీలైనంత త్వరగా పెండెన్సీ పూర్తి చేయాలని సూచించారు. తహసిల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారి స్థాయిలలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను వారం పది రోజుల్లోపు క్లియర్ చేయాలని గడువు విధించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులను క్షేత్రస్థాయి విచారణ చేపట్టి వెనువెంటనే పరిష్కరించాలని అన్నారు. మండలాల వారిగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, సుదీర్ఘ కాలం నుండి పెండింగ్లో ఉన్న వాటిని ముందుగా పరిశీలన జరిపి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించిన ప్రగతి గురించి రోజువారీగా పరిశీలన జరపాలని ఆర్డీఓలకు సూచించారు. వక్ఫ్ భూములు , ఇనాము భూములు , డిఫెన్స్ భూములు నిషేధించబడిన భూములలో ఉన్న దరఖాస్తులు తిరస్కరించబడునని తెలియజేసారు. కాగా, ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పిస్తున్న అర్జీలను ఆయా శాఖలకు బదిలీ చేయడం జరుగుతోందని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని కలెక్టర్ తహసీల్దార్లకు సూచించారు. అర్జీల పరిష్కారానికి చేపట్టిన చర్యలను తెలియజేస్తూ ఆన్లైన్ లో అప్లోడ్ చేసే సమయంలో వివిధ అంశాలను సవివరంగా పేర్కొనాలని అన్నారు. ఏదైనా అర్జీని తిరస్కరిస్తే, అందుకు గల కారణాలను సహేతుకంగా పొందుపర్చాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో అదనపు విజేందర్ రెడ్డి , సంబంధిత అధికారులు, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ పై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ సంబంధిత అధికారులు....

**జిల్లాలో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టండి ....**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్**





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : సరళీకృత చెల్లింపు పథకం (ఎల్ ఆర్ ఎస్) ద్వారా లేఔట్లను క్రమబద్ధీకరణకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు %I.A.S% తెలిపారు. శనివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లు పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ తో పాటు ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో సరళీకృత చెల్లింపు పథకం (ఎల్ ఆర్ ఎస్) ద్వారా లేఔట్లను క్రమబద్ధీకరణపై చేపట్టాల్సిన విధి విధానాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు సలహాలు అందించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా , ప్రభుత్వానికి నష్టం కలగకుండా , సరళీకృత చెల్లింపు పథకం (ఎల్ ఆర్ ఎస్) ప్రక్రియను సమర్ధవంతంగా నిర్యహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు %I.A.S% మాట్లాడుతూ... జిల్లాలోని మున్సిపల్, గ్రామపంచాయతీ పరిధిలోని అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీక రణ పారిదర్శకంగా చేపట్టాలన్నారు. జిల్లాలోని మునిసిపాలిటీలు , కార్పొరేషన్లు, గ్రామపంచాయతీల పరిధిలో క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మార్గదర్శకాలకు అనుగుణంగా పరిష్కార దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడుతూనే ప్రభుత్వ అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణను మూడు దశల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను చేపట్టేందుకు వీలుగా రెవిన్యూ అధికారులు , మునిసిపల్ అధికారులు , ఇరిగేషన్ అధికారులు, గ్రామ పంచాయితీ అధికారులు, కమిటీలను రూపొందిం చాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వారి ఆధ్వర్యంలో సరళీకృత చెల్లింపు పథకం (ఎల్ ఆర్ ఎస్) ద్వారా లేఔట్లను క్రమబద్ధీకరణపై పరిశీలించి తదుపరి సంబంధిత అధికారులకు నివేదిక సమర్పించి క్రమబద్ధీకరణ క్రమంలో తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భూముల క్రమబద్ధీకణపై జిల్లా, మండల, మున్సిపాలిటీ పరిధిల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం C.D.M.A వి.పి.గౌతమ్ IAS మరియు జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు IAS వారి ఆధ్వర్యంలో మునిసిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి ఈ నెల 5 నుండి 9 వరకు నిర్వహించే స్వచం దనం - పచ్చదనం కార్యక్రమాలను విజయవంతం చెయ్యాలని అదే విధంగా వీధి కుక్కలా బారి నుండి ప్రజలను కాపాడే బాధ్యత అందరి మీద ఉందని దానికి సంబంధించిన అనిమల్ బర్త్ కంట్రోల్ రూల్స్ ప్రకారం కుక్కలా జననాలు తగ్గించాల్సి ఉందని దానికి తగ్గ ఏర్పాట్లు చెయ్యాలని ఆదేశించారు అలాగే మునిసిపల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిని పార్కులు గాను వాకింగ్ ట్రాక్స్ గాను , క్రీడా స్థలాలు గాను రూపొందించి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు, అనుమతులు లేని భవనాలను గుర్తించి వాటికి కూల్చివేయడానికే తగిన చెర్యలు తీసుకుంటూ అదనంగా నిర్మించిన భవనాలకు ప్రస్తుత ప్రభుత్వ విధానాల ప్రకారం పన్ను విధించాలన్నారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న వారు , జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు IAS , C.D.M.A వి.పి.గౌతమ్ IAS ,అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ రాధికా గుప్తా IAS , అడిషనల్ కలెక్టర్ డి విజయేందర్ రెడ్డి మరియు మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## శివనామ స్మరణ మధ్య మాస శివరాత్రి పూజలు

శామీర్ పేట, (గరుడ వార్త) : మాస శివరాత్రి పురస్కరించుకొని ఘనంగా పూజలను నిర్వహించారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో (శివాలయం) ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి రుద్రాభిషేకం,





అర్చన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. తూముకుంట, శామీర్ పేటకు చెందిన భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో భక్తి గీతాలు ఆలపించారు. భక్తుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు

# బూడిద చుట్టూ రాజకీయ చిచ్చు!

కరీంనగర్ : బూడిద రవాణా వ్యవహారం రాజకీయ దుమారం లేపుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల పరస్పర విమర్శలకు కేంద్రంగా మారింది. రామగుండం ఎన్టీపీసీ పరిశ్రమ నుంచి వెలువడే బూడిద రవాణాకు సంబంధించి కాంగ్రెస్, భారాస నేతల మధ్య మాటల యుద్ధం రోజురోజుకూ పెరుగుతోంది. రవాణాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఓ పార్టీ ఆరోపిస్తుండగా.. రాజకీయ కక్షతోనే ఆరోపణలు చేస్తున్నారని మరో పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కుందనపల్లి చెరువు నుంచి ఇతర ప్రాంతాలకు కొన్నేళ్లుగా బూడిద తరలిస్తున్నారు. 'అక్రమ రవాణాతో పాటు ప్రతి రోజూ రూ.లక్షల్లో అవినీతి జరుగుతోందని, ఇందుకు అధికార పార్టీ ముఖ్య నేత సహకారముంద'ని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆరోపణలు ఉమ్మడి జిల్లాలో చర్చకు దారి తీశాయి. తాను స్వయంగా కొన్ని లారీలను పట్టించినప్పటికీ రవాణా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన పేర్కొంటుండగా, ఈ ఆరోపణలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రణవ్ ఖండించారు. కౌశిక్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని, అధికారులు కేసులు నమోదు చేశారనే విషయాన్ని ఆధారాలతో చూపించారు. బూడిద తరలింపు వ్యవహారంలో తమ పార్టీకి సంబంధం లేదని చెప్పడానికి తాను చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

### పక్కా పర్యవేక్షణతోనే అడ్డుకట్ట

ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే బూడిద తరలింపు వ్యవహారంపై రవాణా శాఖ అధికారులు పక్కాగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉ



ంది. తరలింపు కేంద్రం వద్ద సీసీ కెమెరాల నిఘాతో పాటు రోజూవారీగా ఎన్ని వాహనాలు వెళ్తున్నాయనే విషయమై వివరాలు పక్కాగా ఉంటేనే బూడిద రవాణా ప్రక్రియ పారదర్శకంగా సాగే వీలుంది. అంతేకాకుండా వాహనాలను మార్గమధ్యంలో తనిఖీలు చేయడం వల్ల అక్రమాలకు అడ్డుకట్ట వేసే అవకాశముంది. మోతాదు కంటే అధిక పరిమాణంలో సరఫరా చేస్తుండటంతో లారీల వెనుక ప్రయాణించే ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతున్నారు. రామగుండం నుంచి రాజీవ్ రహదారి సహా హుజూరాబాద్, వరంగల్ మార్గంలో నిత్యం వివిధ జిల్లాలకు పెద్ద ఎత్తున బూడిద రవాణా జరుగుతోంది. రాత్రింబవళ్లు వందలాది వాహనాలు వెళ్తుండటంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. లారీలతో పలు చోట్ల రహదారులు ధ్వంసమవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్రమాలు, అవినీతికి తావు లేకుండా బూడిద రవాణా ప్రక్రియ నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ విషయమై పెద్దపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి రంగారావును వివరణ కోరగా ఇటీవలి కాలంలో 70 వరకు అనుమతి లేని బూడిద లారీలను పట్టుకొని జరిమానా విధించామని చెప్పారు. బూడిద తరలింపులో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన


రామగుండంలోని బొగ్గు ఆధారిత ఎన్టీపీసీ విద్యుత్తు పరిశ్రమ నుంచి వెలువడే తడి, పొడి బూడిదను అంతర్గాం మండలం కుందనపల్లిలోని ప్రత్యేక చెరువులో నింపుతారు. 500 ఎకరాల్లో ఉన్న ఈ చెరువులో ప్రతి రోజూ టన్నుల కొద్దీ బూడిదను డంప్ చేస్తారు. ఇక్కడి బూడిదను రహదారుల నిర్మాణానికి, ఇటుకల తయారీకి వినియోగిస్తారు. ఎప్పటికప్పుడు తరలించేందుకు టెండర్లు పిలుస్తారు. కాగా లారీలో గరిష్ఠంగా 40 టన్నుల బూడిదను తీసుకెళ్లాల్సి ఉండగా, పక్కలకు చెక్కలు కట్టి అదనంగా మరో 15-20 టన్నులు రవాణా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే రవాణా చేసే లారీకి తప్పనిసరిగా నంబరు ఉండాలి. కానీ నంబరు ప్లేటు లేని వాహనాల్లో యథేచ్ఛగా తరలిస్తూ కొందరు అవినీతికి పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా బూడిద రవాణా జరుగుతోందని, ఇందుకు లెక్కా పత్రం ఉండటం లేదనే విమర్శలున్నాయి. పెద్దపల్లి జిల్లాలోని పలు ఇటుక బట్టీలకు, క్వారీల్లో గుంతలు పూడ్చేందుకు కూడా బూడిదను వినియోగిస్తున్న దాఖలాలున్నాయి. అలాగే ఎక్కడ పడితే అక్కడ బూడిద నిల్వలు కనిపిస్తుండగా, ఇది చెరువు నుంచి అక్రమంగా తరలించినదేనంటూ పలువురు గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన సందర్భాలున్నాయి.

# దోమల నియంత్రణ.. కార్యాచరణ మమ!

పెద్దపల్లి: పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జ్వరాలు విజృంభిస్తున్నాయి.. జ్వర బాధితులు లేని ఇళ్లు ఉండటం లేదు.. వర్షాలతో దోమల బెడద పెరిగింది.. పట్టణాల్లో ఖాళీ స్థలాలు, మురుగు నిల్వ ప్రాంతాలు వాటికి ఆవాసాలుగా మారాయి.. స్థానిక సంస్థలకు క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ ఆ స్థాయిలో ప్రజలకు సేవలందడం లేదు. ఉమ్మడి జిల్లాలోని రెండు నగరపాలికలు, 14 పురపాలికల పరిధిలో పారిశుద్ధ్య చర్యలు, దోమల నివారణ, ఇంటింటికీ చెత్త సేకరణ–నిర్వహణ కార్యక్రమాలు నామమాత్రంగా సాగుతున్నాయి. పురపాలిక బడ్జెట్‌లో దోమల నివారణ, పారిశుద్ధ్య చర్యలకే అధిక మొత్తం కేటాయింపులుంటున్నాయి. నగరపాలికల్లో గరిష్ఠంగా రూ.6 కోట్లు, పురపాలికల్లో రూ.2 కోట్ల వరకు ఏటా ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటున్నాయి. పైగా నిధులు పక్కదారి పడుతున్నాయి. వానాకాలంలో ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది చోద్యం చూడటమే తప్ప వ్యాధుల నివారణ చర్యలు చేపట్టడం లేదంటూ ప్రతి వారం కలెక్టరేట్‌లలో ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

**వారానికి ఒక్క రోజు కూడా గగనమే**

అర్బన్ మలేరియా విభాగానికి చెందిన కార్మికుడు ప్రతి రోజూ 300 ఇళ్ల పరిసరాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయాలి. పని చేసినట్లు ఆధారంగా కాలనీవాసుల సంతకాలు తీసుకోవాలి. ఆ



వివరాలను సంబంధిత విభాగానికి అందించాలి. అయితే ఇది ఉన్నతాధికారుల తనిఖీల సమయంలో తప్ప రోజువారీగా జరగడం లేదు. ఫాగింగ్ విధులు నిర్వర్తించే కార్మికులు నిత్యం తెల్లవారుజామునే ఆరోగ్యాధికారి, ఆరోగ్య కార్యకర్తలకు కనిపిస్తారు. సాయంత్రం ఫాగింగ్ పూర్తయిందని చెబుతూ పెట్రోల్, డీజిల్ కూపన్లు తీసుకుంటున్నారు. నామమాత్రంగా ఫాగింగ్ చేసి మిగిలిన ఇంధనాన్ని నల్లబజారుకు తరలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రామగుండం, కరీంనగర్ నగరాల్లోని మురికివాడల్లో, ప్రధాన వీధుల్లో కనీసం వారానికి ఒక్క రోజైనా ఫాగింగ్ చేయలేదనే విమర్శలున్నాయి.

ఫాగింగ్ యంత్రాలను తరలించే వాహనాలకు జీపీఎస్ పరికరాలు బిగిస్తే తప్ప ఈ ప్రక్రియ సజావుగా జరిగేలా లేదు. ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు యంత్రాలు పని చేయడం లేదని తాపీగా సమాధానాలిస్తున్నారు. కొందరు సీనియర్ అధికారుల అండదండలతోనే ఈ విభాగంలో అక్రమాలు జరుగుతున్నాయని, కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపిస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**యంత్రాలకు మరమ్మతులేవీ!**

ఉమ్మడి జిల్లా జనాభా దాదాపు 40 లక్షలు కాగా దోమల నివారణకు ప్రతి కుటుంబం ఏటా సగటున రూ.3 వేల వరకు వెచ్చిస్తోంది. దాదాపు రూ.10 కోట్ల మేర రీపెల్లెంట్స్, కాయిల్స్, రసాయన ద్రావణాల వాడకం జరుగుతోంది. ఒక ఇంటిలో ఒకరికి జ్వరం వస్తే మిగతా అందరికీ విస్తరిస్తోంది. దీంతో నెల రోజుల వ్యవధిలో చికిత్సకు, వివిధ పరీక్షలకు రూ.10 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది.

కరీంనగర్ నగరపాలక సంస్థలో 10 ఫాగింగ్ యంత్రాలుంటే 6 మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన నాలుగు మరమ్మతుకు నోచుకోవడం లేదు. తరచూ కాకుండా ఎప్పుడో ఓసారి ఫాగింగ్ చేస్తున్నారు. రామగుండం నగరపాలికలో 5 యంత్రాలుంటే 3 మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన రెండింటిని మరమ్మతు చేయాల్సి ఉండగా చేయడం లేదు. ఒక్కో పురపాలికలో నాలుగేసి చొప్పున మొత్తం 14 పురపాలికల్లో 56 యంత్రాలుండగా ఇందులో 25 పని చేయడం లేదని సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారు.

# గ్రేటర్‌లో వాహన విస్ఫోటం

హైదరాబాద్: నగరంలో వ్యక్తిగత వాహనాల రద్దీ ఊహించని విధంగా ఉంటోంది. ఏటా 6 నుంచి 10 శాతం వరకు వాహనాల సంఖ్య పెరుగుతోంది. గ్రేటర్‌లో 9100 కి.మీ.ల మేర రోడ్లుండగా.. వాహనాల సంఖ్య 81.21 లక్షలకు దాటింది. ప్రతి కి.మీ.కి దాదాపు 892 వాహనాలు తిరుగుతున్నాయి. ఇప్పటికే బైక్‌ల సంఖ్య 59 లక్షలకు దాటింది. ప్రజారవాణాతోనే అడ్డుకట్ట హెచ్‌ఎండీఏ సమకూర్చుకున్న డబుల్‌డెక్కర్ బస్సులను ఖాళీగా తిప్పుతున్నప్పటికీ.. ప్రజారవాణాకు సంబంధించి వివిధ రకాల పద్ధతులను హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) అధ్యయనం చేస్తోంది. హెచ్‌ఎండీఏలోని ఉ



మ్టా(యూనిఫైడ్ మెట్రోపాలిటిన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ) దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. వివిధ దేశాల్లో ఉన్న విధానాలపై అధ్యయం చేసి మన నగరానికి ఎలాంటి రవాణా విధానం అమల్లోకి తెస్తే బాగుంటుందో అధికారులు పరిశీలిస్తున్నారు. మెట్రోను ట్రాఫిక్ రద్దీ ఎక్కువున్న ప్రాంతాలకు విస్తరించడంతో పాటు.. 2-3 కిలోమీటర్ల దూరానికి ప్రజలు వ్యక్తిగత వాహనాలు వాడకుండా...ప్రజారవాణా వైపు దృష్టిసారించేలా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఆల్టనేటివ్ అర్బన్ మొబిలిటీ సొల్యూషన్ ఫర్ హైదరాబాద్ పేరుతో వివిధ విధానాలపై ప్రత్యేక దృష్టి సారించారు. కేబుల్ కార్లు, పర్సనల్ రాపిడ్ ట్రాన్సిట్ లాంటి రవాణా సదుపాయాలు నగరానికి ఎంతవరకు అనుకూలంగా ఉంటాయనే విషయమై పరిశీలిస్తున్నారు.

ఇంటి నుంచి కార్యాలయాలకు నేరుగా ప్రజారవాణా ఉండేలా ఏర్పాట్లు చేసినప్పుడే ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. ప్రజారవాణాను ప్రజారోగ్య సంక్షేమ కార్యక్రమంగా చూడాలంటున్నారు.

# పునరావాస స్థలం.. పరాధీనం



సిరిసిల్ల: ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి భూములు కొనుగోలు చేసి నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ప్లాట్లుగా చేసి పంపిణీ చేసింది. ప్రస్తుతం ఈ కాలనీలోని ఖాళీ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. రూ.కోట్ల విలువైన స్థలాలకు రక్షణ కరవైంది. మధ్యమానేరు జలాశయం ముంపు గ్రామాల నిర్వాసితుల కోసం బోయినపల్లి, వేములవాడ గ్రామీణ, అర్బన్ మండలాల్లోని జరుగుతున్న ఈ ఆక్రమణలపై రెవెన్యూశాఖ దృష్టి సారించకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

జిల్లాలోని మధ్యమానేరు జలాశయం నిర్మాణంలో బోయినపల్లి, తంగళ్లపల్లి, వేములవాడ మండలాల్లోని 11 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. 2008లో ముంపు గ్రామాల వివరాలతో ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నిర్వాసితులకు తొమ్మిది చోట్ల ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు 1109.59 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసింది. వీటిలో మౌలిక వసతులు కల్పించి.. 2010-11లో పంపిణీ చేసింది. కాగా ప్రాజెక్టు నిర్మాణంలో 2016 నుంచి వేగం పెరిగింది. అప్పటి నుంచి నిర్వాసితులు తమకు కేటాయించిన కాలనీల్లోని ప్లాట్లలో ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. పంపిణీ చేయగా ఉన్న ఖాళీ స్థలాలను భవిష్యత్తులో పంచాయతీల అవసరాలకు వినియోగించాల్సి ఉంది. కానీ ఆ స్థలాలపై అక్రమార్కుల కన్ను పడింది. రెవెన్యూశాఖ మాత్రం పంపిణీ చేయగా మిగిలిన స్థలాలను దస్త్రాల్లో భద్రంగా ఉంచామనే భ్రమలో ఉంది. 2022లో ప్రభుత్వం పంపిణీ చేసిన ప్లాట్లను నిర్వాసితులు క్రయవిక్రయాలు జరుపుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి వరకు స్తబ్దుగా ఉన్న కాలనీల్లో ఆక్రమణలకు తెరతీసినట్లు అయింది. శాభాష్‌పల్లిలో పంపిణీ చేసిన ప్లాట్లను కొందరు తిరిగి ఇచ్చినట్లు సమాచారం. కాగా ఆ ప్లాట్లు మాత్రం రికార్డుల్లో చూపించడం లేదు. నీలోజిపల్లిలో ఖాళీ ప్లాట్లను చదును చేసి పంటలు సాగుచేస్తున్నారు. చింతల్‌ఠాణాలో రెవెన్యూశాఖ ఏర్పాటు చేసిన ప్లాట్ల హద్దురాళ్లను తొలగించి స్థానికులు ప్లాట్లుగా చేసి రిజిస్ట్రేషన్లు చేసినట్లు సమాచారం. వీటన్నింటిని చూస్తూ అధికారులు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు.

**పర్యవేక్షణ కొరవడి**

వేములవాడ పట్టణ సమీపంతోపాటు సిరిసిల్ల- కరీంనగర్ ప్రధాన రహదారిని ఆనుకుని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలు ఉన్నాయి. పట్టణ విస్తరణతోపాటు రహదారికి సమీపంలో ఉండటంతో భూముల విలువ రోజురోజుకు పెరుగుతుంది. రిజిస్ట్రేషన్లలో ఖాళీ స్థలాలు నమోదు కాలేదు. ఇదే అదనుగా సర్వే నంబరులో పక్క ఇంటి నంబరుతో మార్పులు చేసి దస్త్రాలు సృష్టిస్తున్నారు. వీటి ఆధారంగా రిజిస్ట్రేషన్‌లతో చేతులు మారుతున్నాయి. పలు కాలనీల్లో హద్దురాళ్లను తొలగించడంతో వివాదాలు చోటు చేసుకున్నాయి. ఖాళీ స్థలాల రక్షణకు బోర్డులు, కంచెవంటి నిర్మాణాలు లేవు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు కలిపి ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉండటం.. ఆయా ప్రాంతాలపై అవగాహన కొరవడటం.. దీనికితోడు పర్యవేక్షణలేమితో అక్రమార్కులకు కలిసివస్తోంది.

**రక్షణ చర్యలు చేపడతాం**

ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఆక్రమణలు జరుగుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. అనుపురంలో ఇలాంటి వ్యవహారంపై విచారణ జరుపుతున్నాం. ఖాళీ స్థలాల పరిరక్షణ బాధ్యత పంచాయతీలకే ఉంది. ఎక్కడైనా ఆక్రమణలు జరిగితే ప్రజలు నేరుగా మా దృష్టికి తీసుకురావచ్చు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోని ఖాళీ స్థలాల రక్షణకు చర్యలు చేపడతాం.రాజేశ్వర్, ఆర్డీవో, వేములవాడ

# దృశ్య సహితం.. విజ్ఞాన వికాసం



పెద్దపల్లి : పది సార్లు విన్న మాట కన్నా ఒక్కసారి చూసిన దృశ్యం చాలా కాలం గుర్తుండిపోతుంది. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే మేధస్సు వికసిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యాంశాలపై లోతైన విషయ పరిజ్ఞానం అందించేందుకు విద్యా శాఖ గతేడాది డిజిటల్ టచ్ స్క్రీన్ టీవీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాటి సాయంతో ఉన్నత పాఠశాలల్లోని 8, 9, 10 తరగతులకు సాంకేతిక పాఠాలు బోధిస్తున్నారు. దృశ్య సహిత బోధన సత్ఫలితాలిస్తోంది.

**విడతల వారీగా పంపిణీ**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు ఏటికేడు పడిపోతున్నాయి. పోటీ ప్రపంచంలో అవసరమైన సామర్థ్యాలు కొరవడి విద్యార్థులు రాణించలేకపోతున్నారు. ప్రైవేటు బడులకు దీటుగా కార్పొరేట్ స్థాయిలో డిజిటల్ బోధన అందించేందుకు గతేడాది ఉన్నత పాఠశాలలకు విడతల వారీగా 'ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్' డిజిటల్ స్క్రీన్ టీవీలు పంపిణీ చేశారు. ఉచిత వైఫై సౌకర్యం కల్పించారు. దీంతో దృశ్య సహిత బోధన విద్యార్థులకు మరింత చేరువైంది.

**ఒక్కో బడికి రూ.10.58 లక్షలు**

తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్(టీఎస్‌టీఎస్) ద్వారా సమగ్ర శిక్షా నిధులతో ప్రతి పాఠశాలకు రూ.10.58 లక్షల విలువైన మూడు పరికరాలను సమకూర్చారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ స్క్రీన్(ఐఎఫ్‌ఎస్)లో 75 అంగుళాల గ్రీన్ ప్యానల్, 2 కేవీఏ యూపీఎస్, 12 వోల్టేజీ సామర్థ్యంతో ఆరు ఎక్సైడ్ బ్యాటరీలు, ఇతర పరికరాలను పంపిణీ చేశారు. బ్యాటరీలతో విద్యుత్తు సరఫరా లేకున్నా బోధించే వీలుంది. గ్రీన్‌బోర్డ్ ప్యానల్‌లో ఆన్‌లైన్ పాఠాలు, టచ్ స్క్రీన్ బోధన.. ఇలా రెండు రకాల ప్రయోజనాలు కలుగుతున్నాయి.

**చిత్రాలతో సందేహాల నివృత్తి**

పాఠ్యాంశం పూర్తి చేసిన ఉపాధ్యాయుడు లోతైన విజ్ఞానం కోసం డిజిటల్ తెరపై బోధిస్తున్నారు.

గణితంలో కీలకమైన బీజ గణితం, తదితర అంశాలపై టూల్స్‌ను వినియోగించి బోధిస్తున్నారు.

భౌతిక, రసాయన, జీవశాస్త్ర పాఠాల్లోని కష్టతరమైన అంశాలపై చిత్రాలతో సందేహాలు నివృత్తి చేస్తున్నారు.

యూట్యూబ్, యాప్‌ల సాయంతో అవగాహన కల్పిస్తుండటంతో విద్యార్థులకు సులభంగా అర్థమవుతోంది.

ఈ ప్యానల్‌లో సబ్జెక్టులకు సంబంధించి పాఠాలు నిక్షిప్తమయ్యాయి. యూట్యూబ్, యాప్‌లతో కూడా దృశ్య బోధన అందుబాటులోకి వచ్చింది.

అవాంతరాలు అధిగమిస్తే..

ఉమ్మడి జిల్లాలో 660 ఉన్నత, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల్లో 96,694 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 1,980 ఇంటరాక్టివ్ ప్యానళ్లకు రూ.69.89 కోట్లు వెచ్చించారు.

ఈ ప్యానల్‌లో కొన్ని పాఠ్యాంశాలకు సంబంధించి విషయ పరిజ్ఞానాన్ని మాత్రమే అప్‌లోడ్ చేశారు. అన్ని పాఠాలు అందుబాటులో ఉంటే బాగుంటుంది.

ఉచిత వైఫై పరికరాలున్నా కొన్ని చోట్ల కనెక్షన్ ఇవ్వలేదు. మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య ఇబ్బందికరంగా మారింది.

పాఠం మధ్యలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగితే బ్యాటరీలు ఆశించిన స్థాయిలో పని చేయడం లేదు.

అంతర్జాలం నుంచి సేకరించిన అంశాలను స్క్రీన్‌పై చూపిస్తూ వివరిస్తుండటంతో విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంచుకుంటున్నారు. ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తే పూర్తి స్థాయిలో సార్థకత చేకూరుతుంది.

కఠిన అంశాలపై పట్టు

పాఠం పూర్తయిన తర్వాత సాంకేతికత సాయంతో బోధనలో అదనపు విజ్ఞానం అందిస్తుండటంతో సులువుగా అర్థమవుతోంది. గణితంలో కఠినమైన అంశాలపై పట్టు సాధిస్తున్నాం. కవులు, రచయితల సాహిత్య అంశాలను లోతుగా తెలుసుకుంటున్నాం.

నమిత, 9వ తరగతి, మంథని జడ్పీ ఉన్నత బాలికల పాఠశాల

ఆసక్తిగా వింటున్నారు

స్మార్ట్ బోధన విద్యార్థుల మెదడులో నిలుస్తుంది. ఒక పాఠ్యాంశంపై సమగ్రంగా పట్టు సాధించేలా వారిని సిద్ధం చేస్తున్నాం. సబ్జెక్టుకు అవసరమైన అదనపు సమాచారాన్ని తెరపై చూపిస్తుండటంతో విద్యార్థులు ఆసక్తిగా వింటున్నారు.జక్కం శ్రీనివాస్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, పోతారం, ముత్తారం మం.

పకడ్బందీగా అమలుకు పర్యవేక్షణసాంకేతిక బోధనపై ఉపాధ్యాయులకు నిపుణులతో శిక్షణ ఇచ్చాం. దృశ్య సహిత బోధనతో విద్యార్థులు పాఠాలను ఆసక్తిగా వింటున్నారు. ఈ విధానాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు పర్యవేక్షిస్తున్నాం. కార్పొరేట్ స్థాయి బోధనతో ప్రమాణాలు పెరుగుతున్నాయి. మల్లేశంగౌడ్, సమగ్ర శిక్షా జిల్లా సమన్వయకర్త

# గాడితప్పిన చెత్త సేకరణ

రాజధానిలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఇంటింటి చెత్త సేకరణ పూర్తిగా గాడి తప్పింది. ప్రతి ఇంటికి వెళ్లి ఉదయాన్నే చెత్త సేకరించాల్సిన స్వచ్ఛ ఆటోలు వీధులకు రావడం లేదు. వ్యక్తిగత కారణాలతో కొందరు డ్రైవర్లు విధులకు డుమ్మా కొడుతుంటే.. మరికొన్ని ఆటోలు నగరంలోనే కనిపించట్లేదు. మరోవైపు కొన్ని స్వచ్ఛ ఆటోలు క్రమం తప్పకుండా విధులు నిర్వహిస్తున్నాయి. అలాంటి వారిని గుర్తించి సత్కరించాలని.. తద్వారా మిగిలిన కార్మికుల్లో మార్పు వస్తుందని ఇటీవల కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ కింది స్థాయి యంత్రాంగంలో చలనం కనిపించట్లేదు.

రెండు వేల కుప్పలు..నగరంలో ఇంటింటి చెత్త సేకరణ, హోటళ్లు, ఇతర వ్యాపార కేంద్రాలు, రోడ్లపై పడుతోన్న చెత్త కుప్పల నుంచి రోజుకు 7,000 నుంచి 7,500 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. చెత్త కుప్పల వ్యర్థాలే 1,500 టన్నులు. ఇంటింటి చెత్త సేకరణ సరిగా లేక ఈ సమస్య.ఐదేళ్ల కిందట నగరంలో 1,200 చెత్తకుప్పలుండేవి. అప్పట్లో బల్దియా కేంద్ర కార్యాలయం కఠినంగా వ్యవహరించేది. అనంతరం వచ్చిన ఉన్నతాధికారులు.. చెత్తకుప్పలున్నా ఫర్వాలేదు.. ఉదయాన్నే శుభ్రం చేయాలని సూచించారు. దీంతో ఇళ్లలోని చెత్తను రోడ్లపై వేసే నివాసితులు, హోటళ్లు, సంతలు, తోపుడుబండ్లు, సంచార హోటళ్లు, రెస్టారెంట్లు, బార్ల యజమానులు అడ్డదారి ఎంచుకుని రోడ్లపై పడేయటం ప్రారంభించారు. 30 సర్కిళ్లలో 2 వేలకుపైగా చెత్త కుప్పలు వెలిశాయి. నగరం మొత్తాన్ని జీహెచ్‌ఎంసీ 4,864 కాలనీలుగా గుర్తించింది. ఎస్‌ఎఫ్‌ఏ(శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్), డీసీ, ఇంజినీర్లు, సహాయ వైద్యాధికారులు.. పర్యవేక్షణ మొక్కుబడిగా చేసి వాట్సప్ గ్రూపులో ఫొటోలు పెట్టి వదిలేస్తున్నారు.

# ప్రైవేటు కొలువుల జోరు.. రూ.8లక్షల నుంచి రూ.23 లక్షల వేతనం

హైదరాబాద్: ప్రాంగణ నియామకాలు ప్రారంభమయ్యాయి. ఒకటి రెండేళ్లుగా ఆఫ్‌లైన్ దరఖాస్తులనే పరిశీలిస్తూ వస్తున్న కార్పొరేట్ సంస్థలు ఇప్పుడు కళాశాలల బాట పడుతున్నాయి. అయితే నెమ్మదిగా అడుగులేస్తున్నాయి. దీంతో ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ కళాశాలల్లో నియామకాల సందడి ప్రారంభమైంది. నిజాం కళాశాలలో ఫార్మా కంపెనీలు విద్యార్థులకు నియామక పత్రాలు ఇస్తుండగా.. తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ హైదరాబాద్‌లో ప్రాంగణ నియామకాలు మొదలయ్యాయి. నగర శివారులోని ఇంజినీరింగ్ కళాశాలల్లోనూ విద్యార్థులకు రూ.లక్షల్లో ప్యాకేజీలు ఇచ్చేందుకు కొన్ని ఐటీ సంస్థలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. ఓయూలో ఇటీవల జరిగిన ప్రాంగణ నియామకాల్లో ఎంబీఏ, టెక్నాలజీ మేనేజ్‌మెంట్ విద్యార్థులు 17 మందికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొలువులు ఇచ్చింది. రూ.8 లక్షల నుంచి రూ.23 లక్షల మధ్య వార్షిక వేతనంతో ఈ నియామకాలు జరిగాయి. ఎంబీఏ కళాశాలలో నాలుగో సెమిస్టర్ చదువుతున్న 120 మంది విద్యార్థుల్లో 109 మందికి వేర్వేరు కంపెనీలు నియామక పత్రాలు అందించనున్నాయి. ఆగస్టు తొలివారంలో మరో 10 కంపెనీలు ప్రాంగణ నియామకాల కోసం ఓయూకు రానున్నాయి.

మౌఖిక పరీక్షలకు శిక్షణ..ఉద్యోగ నియామక ఇంటర్వ్యూలకు విద్యార్థులను సిద్ధం చేసే పనిలో ఆయా కళాశాలలు నిమగ్నమయ్యాయి. తడబాటు లేకుండా కంపెనీల ప్రతినిధులతో మాట్లాడటం.. వారి ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు వీలుగా ఓయూలో హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఇంజినీరింగ్ కళాశాల సంయుక్తంగా శిక్షణ ఇచ్చారు. జేఎన్‌టీయూతో పాటు ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు తమ విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇప్పిస్తున్నాయి.

# ఇల్లు కట్టారా.. కట్టి ఇచ్చారా..!

నల్గొండ : కేసీఆర్ నేతృత్వంలోని గత భారాస ప్రభుత్వం నిర్మించిన రెండు పడకగదుల ఇళ్ల స్థితిగతులపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత పదేళ్లలో ఎన్ని ఇళ్లు నిర్మించారు, ప్రస్తుతం అవి ఏ పరిస్థితుల్లో ఉన్నాయి, పూర్తయిన ఇళ్లను ఎంత మందికి కేటాయించారనే వివరాలను సమగ్రంగా నివేదించాలని మూడు జిల్లాల అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు మౌఖికంగా ఆదేశించినట్లు తెలిసింది. దీంతో గత రెండు రోజులుగా అధికారులు నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లోని రెండు పడకగదుల సముదాయాల వద్దకు వెళ్లి ఫొటోలతో సమగ్ర వివరాలను సేకరిస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్గదర్శకాల రూపకల్పనలో నిమగ్నమైన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు ఇళ్లపై సర్వే నిర్వహిస్తున్నారు. తాజా బడ్జెట్‌లో ఏడాదికి ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున నిర్మిస్తామని..తొలుత సొంత జాగా ఉన్న వారికి రూ.5 లక్షల సాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై మార్గదర్శకాల విడుదలకు ముందే ప్రస్తుతం రాష్ట్రంలో గత ప్రభుత్వం చేపట్టిన రెండు పడకగదుల ఇళ్ల స్థితిగతులను తెలుసుకొని నిర్మాణం పూర్తయిన వాటిని లబ్ధిదారులకు కేటాయించి, తుది దశలో ఉన్నవాటిని పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు.

గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 17,199 ఇళ్లు మంజూరు చేయగా..ఇప్పటి వరకు 6,391 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. ఇందులో కేవలం 880 ఇళ్లను మాత్రమే లబ్ధిదారులకు అందజేశారు. దేవరకొండ, నల్గొండ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తయి మూడేళ్లు కావొస్తుంది. నల్గొండ పట్టణంలో 540 ఇళ్లను నిర్మించగా.. గతంలో మౌలిక వసతులు పూర్తి కాలేదనే నెపంతో లబ్ధిదారులకు కేటాయించాలేదు. ఇప్పటికే సగం వరకు ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. ఎక్కువ దరఖాస్తులు వాటికే...

జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ఎక్కువ దరఖాస్తులు ఇళ్లు కావాలనే వస్తుండటం గమనార్హం. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల్లోనూ ఇవే అత్యధికంగా ఉన్నాయని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు నిర్వహిస్తున్న సర్వేలో ఈ దరఖాస్తులను సైతం పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

అర్హులుగా ఉండి ఇళ్లు రానివారితో పాటూ కేటాయించిన వాటిలో అనర్హులు ఎవరైనా ఉన్నారా, రాజకీయ పలుకుబడి, పైరవీలతో గత ప్రభుత్వం ఎంత మందికి ఇళ్లను కేటాయించిందనే దానిపైనా వివరాలు సేకరిస్తున్నామని ఓ ఇంజినీరింగ్ ఉన్నతాధికారి 'ఈనాడు'తో అభిప్రాయపడ్డారు. నాగార్జునసాగర్‌లో ఒక్కటి కూడా రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టకపోగా.. యాదాద్రి జిల్లాలో 829 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా... ఒక్కటిని కూడా లబ్ధిదారులకు కేటాయించలేదు. తాజా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఈ ప్రాంతాలకు మొదటి ప్రాధాన్యం ఉండనున్నట్లు తెలిసింది. త్వరలోనే సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని.. అన్ని జిల్లాల నుంచి నివేదికలు అందిన తర్వాత ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లపై మార్గదర్శకాలు వెలువడే అవకాశం ఉన్నట్లు ఓ జిల్లా ఉన్నతాధికారి తెలిపారు.

# వీధిరుణం.. విధికి వరం

సూర్యాపేట: వీధి వ్యాపారులకు ఆత్మనిర్భర్ పథకం వరంగా మారింది. పథకం కింద రుణాలు పొందుతూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ఈ పథకం ద్వారా రుణాలు మంజూరవుతున్నాయి. జిల్లాలో మొదటి, రెండు విడతల్లో 17,785 మంది వీధి వ్యాపారులు రుణాలు పొందారు. నిర్ణీత గడువులోగా బ్యాంకులకు చెల్లించిన వారికి రుణ పరిమితిని పెంచారు. మూడో విడతలో జిల్లాలోని పుర పురపాలికల్లో 1701 మందికి రుణాలకు ఎంపికయ్యారు.

నాలుగో విడతకు సిద్ధం

జిల్లాలోని ఐదు పురపాలికల్లో రుణాలు సక్రమంగా చెల్లించిన వారికి నాలుగో విడత రుణాలు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఆత్మనిర్భర్ పథకం కింద వీధి వ్యాపారులకు రుణ లక్ష్యం పెంచేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ రుణాలతో పేద, మధ్య తరగతి వర్గాలను ఆదుకోవడానికి సర్కారు దృష్టి పెట్టింది. ఆర్థికంగా బలోపేతమయ్యేలా స్వయం సంఘాలకు, వీధి వ్యాపారులకు తోడ్పాటు అందిస్తున్నారు. ప్రధాన ప్రాంతాలతో పాటు అంతర్గత వార్డుల్లో ఉన్న వీధి వ్యాపారులను పరిగణనలోకి తీసుకోనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

శ్వేత, టీఎంసీ, సూర్యాపేట

కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ పథకం కింద అందించే రుణాలను వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో చెల్లించిన వారికి రుణాలు మంజూరవుతాయి. రెండు, విడతల్లో చెల్లించిన వ్యాపారులకు మూడోసారి రెండింతలు రుణం పెంచే అవకాశం ఉంది.

# పరిహారానికి ఎదురుచూపులు

బోయినపల్లి: అదనపు టీఎంసీ కాలువ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న దేశాయపల్లి నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్, ఇళ్ల పరిహారానికి నిరీక్షణ తప్పడం లేదు. పరిహారం అందించడంలో భాగంగా అధికారులు క్షేత్ర స్థాయిలో పలుమార్లు సర్వే నిర్వహించారు. సర్వేలు ముగిసి రెండేళ్లు గడుస్తున్నా పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతుంది. కాళేశ్వరం అదనపు టీఎంసీ(1.1 టీఎంసీ) కాలువ నిర్మాణంలో భాగంగా దేశాయపల్లిలో ప్రధాన రహదారి నుంచి వరదకాలువకు అవతలివైపు ఉన్న ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. విలాసాగర్, దేశాయపల్లి, మర్లపేట, రత్నంపేట, రాజన్నపేటకు చెందిన రైతుల వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యాయి. ఆయా రైతులకు పరిహారం చెల్లించారు. వివిధ కారణాలు, అభ్యంతరాలు ఉన్న రైతులకు చెల్లింపులు కాలేదు.

**సర్వే పూర్తయి రెండేళ్లు గడిచినా..**

ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం అందించడంలో భాగంగా రెవెన్యూ అధికారులు గ్రామంలో రెండేళ్ల క్రితం సర్వే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్, రేషన్ కార్డు, వృత్తి ఇతర వివరాలు నమోదు చేసుకున్నారు. 144 మంది నిర్వాసితులుగా మారుతున్నట్లు గుర్తించారు. ఒక్కో కుటుంబానికి 75 చదరపు గజాల ఇంటి స్థలం, రూ.6.60 లక్షల పరిహారం, ఇంటి



నిర్మాణానికి రూ.1.25 లక్షలు చెల్లిస్తామని అధికారులు తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేసి మౌళిక సదుపాయాలు కల్పించనున్నట్లు వివరించారు. భూసేకరణ చేయడానికి వరదకాలువ సమీపంలో 11 ఎకరాలు పీఎన్ (ప్రిలిమినరీ నోటిఫికేషన్) ప్రచురించారు. వన్‌టైం సెటిల్‌మెంట్(ఓటీస్) కింద ఒకేసారి ఒక్కో కుటుంబానికి రూ.12 లక్షలు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించాలని కొంత మంది నిర్వాసితులు జిల్లా కలెక్టర్, తహసీల్దారు కార్యాలయాల్లో వినతి పత్రాలను అందించారు. దీనిపై నిర్వాసితుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

**ప్రచురణ కాని గెజిట్..**

నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో భాగంగా క్షేత్ర స్థాయిలో నిర్వహించిన సర్వే జాబితాపై సుమారు పది నెలల క్రితం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. జాబితాలో తమ పేర్లు రాలేదని కొంత మంది నిర్వాసితులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరికొంత మంది నిర్వాసితులు అనర్హులకు చోటు కల్పించారని ఫిర్యాదు చేశారు. వారి నుంచి వచ్చిన అభ్యంతరాలపై అధికారులు విచారణ చేయించారు. అయితే గెజిట్ జాబితా ప్రచురణ పూర్తయితేనే నిర్వాసితుల ఎంత మంది అనేది తేలనుంది.

**ఆర్‌అండ్‌ఆర్ జాబితా పూర్తయింది**

దేశాయపల్లి నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం చెల్లించడంలో భాగంగా గతంలోనే గ్రామ సభ నిర్వహించి జాబితా రూపొందించాం. గెజిట్ ప్రచురణ చేయాల్సి ఉంది. ఇళ్లకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు రూపొందించారు. రాజేశ్వర్, ఆర్డీవో వేములవాడ

# తెల్ల బంగారానికి వరుణుడి దెబ్బ

సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా మెట్ట ప్రాంతం. జిల్లా రైతులు వరిసాగు తరువాత వర్షాధారంగా పత్తిపంట సాగుపై ఆసక్తి కనబరుస్తారు. ఈ ఏడాది కూడా ఖరీఫ్‌లో ఎంతో ఉత్సాహంగా తెల్లబంగారం సాగు చేశారు. పత్తి మొక్కలు పెరుగుదల దశలో ఉండగా పక్షం రోజులుగా ఎడతెరిపి లేకుండా మోస్తరు వర్షాలు కురుస్తుండటం తీవ్ర ప్రభావం చూపింది. అధిక తేమతో పంటలో కలుపు మొక్కల ఉద్ధృతి పెరిగిపోయింది. మొక్కలు ఎర్రబారాయి. పంట చీడ, పీడల సస్యరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. పెట్టుబడి పెరిగి దిగుబడిపై ప్రభావం చూపనుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**50 వేలకు పైగా ఎకరాల్లో..**

జిల్లాలో 13 మండలాలు ఉండగా సుమారు 2.40 లక్షల పైగా ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 1.80 లక్షల ఎకరాల్లో వరి, రెండో స్థానంలో 50 వేలకు పైగా ఎకరాల్లో పత్తిసాగు చేశారు. పత్తి



పంట వేసి 45 రోజులు కావొస్తుంది. పంట పెరుగుదల దశలో ఉండగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి పంట క్షేత్రాల్లో వర్షపు నీరు నిలిచి మొక్కలు వడలిపోవటం, ఎర్రబారటం, వేర్లు కుళ్లిపోవటం జరుగుతోంది. ప్రస్తుతం మొక్కల పెరుగుదల ఆశించిన స్థాయిలో లేదు. పంట సాగుకు పెట్టుబడి వ్యయం పెరిగి దిగుబడి తగ్గనుంది. దీంతో ఆశించిన లాభాలు సాధించే అవకాశాలు కనిపించటం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ఎకరాకు రూ.35 వేలు పెట్టుబడి పెట్టా**

నాకున్న అయిదు ఎకరాలు, మరో అయిదు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నా. ఎకరానికి దమ్ము చేయటం, పత్తి విత్తనాలు కొనుగోలు, కూలీలు, ఎరువులు వేయటం ఇప్పటి వరకు రూ.35 వేల పెట్టుబడి పెట్టా. పంట చేతికి వచ్చే సరికి మరో రూ.20 వేల వరకు పెట్టుబడి వ్యయం కానుంది. వాతావరణం అనుకూలించి, బహిరంగ మార్కెట్‌లో పత్తిపంటకు గిట్టుబాటు ధర లభిస్తే రైతులకు కొంతమేర లాభాలు వస్తాయి. రొక్కం శ్రీకాంత్‌రెడ్డి, రైతు మంగళ్లపల్లి

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి: భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి

పత్తి రైతులు ఆందోళన చెందవద్దు. సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు కాలువలు (పాదుకల) ద్వారా బయటకు పంపించాలి. మొక్కల దగ్గర ఉన్న కలుపు మొక్కలను కూలీలతో తొలగించాలి. ఎర్రబారిన, వడలిపోయిన మొక్కలు త్వరగా పెరుగుదలకు వచ్చేలా 19-19-19, మల్టీకే, న్యూట్రిషన్ ద్రావణం పిచికారీ చేయాలి. వేరు, కాండం కుళ్లు సోకితే కాపర్ ఆక్సిక్లోరైడ్ మొక్కల చుట్టూ పోయాలి.

# సింగరేణిలో సీబీఎస్‌ఈ విధానానికి పచ్చజెండా




గోదావరిఖని: సింగరేణి ఉద్యోగుల పిల్లలకు సీబీఎస్‌ఈ విద్యా విధానం అందుబాటులోకి రానుంది. యాజమాన్యం నిర్వహిస్తున్న సెక్టార్-3 పాఠశాలలో బోధనకు అభ్యంతరం లేదని రాష్ట్ర విద్యాశాఖ నివేదిక అందజేసింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు రాగానే ఈ విధానాన్ని ప్రారంభించేందుకు సింగరేణి యాజమాన్యం కసరత్తు చేస్తోంది. ముందుగా రామగుండం ప్రాంతంలోని ఆర్జీ-2 సెక్టార్-3 పాఠశాలలో ఈ విధానం అమలు చేసి అనంతరం శ్రీరాంపూర్‌లోని పాఠశాలలో సైతం సీబీఎస్‌ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు నిర్ణయించింది. ఇప్పటివరకు సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించే పాఠశాలల్లో రాష్ట్ర విద్యాశాఖ విధానం ద్వారా బోధన చేపడుతున్నారు. కేంద్ర విద్యా విధానంపై కార్మికులు ఆసక్తి చూపడంతో ఆదిశగా యాజమాన్యం చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే ప్రస్తుతం సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో మొదటి దశలో సెక్టార్-3 పాఠశాలను ఎంపిక చేసింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో సెక్టార్-3లో ఉత్తమ ఫలితాలు సాధిస్తుంది. దీంతో ఈ పాఠశాలను ఎంపిక చేశారు.

**మూడు నెలల్లో ప్రక్రియ పూర్తి**

సీబీఎస్‌ఈ విధానానికి సంబంధించిన ప్రక్రియ మూడు నెలల్లో ముగియనుంది. కేంద్ర మంత్రిత్వ శాఖకు యాజమాన్యం లేఖరాయగా త్వరలోనే బృందం పర్యటించనుంది. సెక్టార్-3 పాఠశాలలో మౌలిక సదుపాయాలు, తరగతి గదులు, మైదానం తదితర అంశాలను పరిశీలించి ఆమోదించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో సీబీఎస్‌ఈ విధానానికి అనుకూలంగా తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు.

**వచ్చే విద్యా సంవత్సరం అందుబాటులోకి..**

వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్‌ఈ తరగతులు ప్రారంభం కానున్నాయి. అందుకు సంబంధించిన పనులను యాజమాన్యం వేగవంతం చేసింది. రామగుండం రీజియన్ మొత్తానికి సెక్టార్-3 పాఠశాలను ఏర్పాటు చేయనుండటంతో యువ కార్మికుల పిల్లలకు అందులోనే విద్యా బోధన చేపట్టనున్నారు. సంస్థలో ప్రస్తుతం యువ కార్మికులు ఎక్కువగా ఉండటంతో వారి పిల్లలకు మెరుగైన విద్యనందించేందుకు ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. యాజమాన్యం నిర్వహిస్తున్న పాఠశాలల్లో ఆస్థాయిలో విద్యా బోధన ఉండటంలేదని భావించిన కార్మికులు సీబీఎస్‌ఈ విధానంలో తరగతులు చేపట్టాలని డిమాండ్ చేయగా యాజమాన్యం చర్యలు తీసుకుంది. సింగరేణి వ్యాప్తంగా 9 పాఠశాలలు, పాలిటెక్నిక్ కళాశాల, మహిళా డిగ్రీ, జూనియర్ కళాశాలలను నిర్వహిస్తున్నారు. ఆయా విద్యా సంస్థల్లో 7,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. కార్మికుల పిల్లల కోసం సంస్థ తొలిసారిగా 1975లో విద్యా సంస్థలను నెలకొల్పింది. 9 ఉన్నత పాఠశాలలతో పాటు రామగుండం రీజియన్‌లో కార్మికులు సమ్మె చేసిన సందర్భంలో అయిదు ప్రాథమిక పాఠశాలలను సైతం ఏర్పాటు చేసింది. కార్మికుల సంఖ్య తగ్గుతూ రావడంతో క్రమక్రమంగా నిర్వహణను తగ్గించుకుంటూ వచ్చింది. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన యువ కార్మికులు తమ పిల్లలకు సీబీఎస్‌ఈ విధానం కావాలని ఒత్తిడి తేవడంతో యాజమాన్యం చర్యలు చేపడుతోంది.

# అసలే గుంతలు.. ఆపై వానలు



పెద్దపల్లి : 'మూలిగే నక్కపై తాటిపండు' చందాన అసలే గుంతలమయంగా మారిన రహదారులను ఇటీవలి వర్షాలు మరింత దెబ్బ తీశాయి. ముసురు వానలతో దారి పొడవునా గుంతలు పడ్డాయి. వాటిలో నీరు నిలవడంతో రాకపోకలకు అవస్థలు తీవ్రమయ్యాయి. పలు చోట్ల నిధులున్నా పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. మరికొన్ని మార్గాల్లో ఏళ్ల తరబడి ప్రతిపాదనల దశ దాటడం లేదు. కల్వర్టులు శిథిలావస్థలోకి చేరుతున్నాయి. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతు అంచనాలు రూపొందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

ఇది ముత్తారం మండలం కేశనపల్లి నుంచి ఓడేడ్ వెళ్లే రోడ్డు. తారు ఆనవాళ్లు లేకపోగా మట్టి గుంతలతో నిండిపోయింది. వర్షాలకు పెద్ద గోతులు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి, మీర్జంపేట గ్రామాల మధ్యలో లోలెవల్ కల్వర్టు వర్షాలకు దెబ్బతింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలకు సాగించేందుకు అంతరాయం కలుగుతోంది. కొత్తగా వంతెన నిర్మాణానికి రూ.2.3 కోట్లతో ప్రతిపాదించారు.

ఓదెల మండలం ఇందుర్తి, శానగొండ గ్రామాల మధ్యలో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గతేడాది రూ.18 కోట్లతో పనులు చేపట్టినా అసంపూర్తిగా వదిలేశారు. ఇటీవలి వర్షాలకు రహదారి పూర్తిగా దెబ్బతింది.

**ఎక్కడెక్కడ.. ఎలా!**

పెద్దపల్లి నుంచి జూలపల్లి మార్గంలో రహదారిపై తారు పూర్తిగా కొట్టుకుపోయింది. రూ.19 కోట్లతో పనులు చేపట్టగా ఇరువైపులా చెట్లను తొలగించి వదిలేశారు. వర్షాలకు రహదారి మరింత దెబ్బతింది.

సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ నుంచి కనుకుల క్రాస్ రోడ్డు వరకు గ్రానైట్ వాహనాల రాకపోకలతో గోతులు పడ్డాయి.

ఎలిగేడు నుంచి సుల్తాన్‌పూర్ మీదుగా గర్రెపల్లి వరకు రహదారి ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోవడం లేదు.

పెద్దపల్లి-ధర్మారం మార్గంలో కాసులపల్లి, కనగర్తి మధ్యలో రహదారి గుంతలమయంగా మారింది. పెద్ద పెద్ద గోతులతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ముత్తారం మండలం దర్యాపూర్ సమీపంలో రహదారి అధ్వానంగా తయారైంది. ముత్తారం మండలం నుంచి ఖమ్మంపల్లి వెళ్లే మార్గంలో ఇసుక లారీలతో దెబ్బతింది.

మంథని నుంచి బిట్టుపల్లి వరకు రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడ్డాయి. గోపాల్‌పూర్, ఖమ్మంపల్లి ఇసుక క్వారీల లారీలతో దెబ్బతింది.

జిల్లాలో ప్రధాన మార్గమైన రాజీవ్ రహదారిపై వాహనాల రద్దీతో పాటు వర్షాలకు పలు చోట్ల తారు లేచిపోతోంది. గుంతలతో వేగంగా వచ్చిన వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

**ఎందుకీ పరిస్థితి!**

జిల్లాలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల పరిధిలో రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు కొరవడుతున్నాయి.

సామర్థ్యానికి మించి అధిక బరువు వాహనాల రాకపోకలతో రహదారులు దెబ్బతింటున్నాయి.

పనులు చేసిన గుత్తేదార్లకు సకాలంలో బిల్లుల చెల్లించకపోవడంతో నత్తనడకన సాగుతుండటంతో పాటు నాణ్యత లోపిస్తోంది.

గతేడాది దెబ్బతిన్న రహదారులకు నామమాత్రంగా మరమ్మతు చేసి చేతులు దులుపుకున్నారు.

ప్రాధాన్య అవసరాలకు నిధులు కేటాయిస్తే రవాణా వెతలు తీరనున్నాయి. అధికారులు ఏమంటున్నారంటే..

జిల్లాలో తమ పరిధిలో రహదారుల నిర్మాణంలో జాప్యం లేకుండా పనులు చేపడుతున్నామని పంచాయతీరాజ్ ఈఈ గిరీశ్‌బాబు తెలిపారు. రెండు చోట్ల దెబ్బతినగా మరమ్మతుకు ప్రతిపాదించామని వెల్లడించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మతు పనులకు ప్రతిపాదిస్తామని ఆర్‌అండ్‌బీ ఈఈ బావుసింగ్ తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత పెండింగ్ పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని చెప్పారు.

# రహదారులు అధ్వానం

మెట్‌పల్లి : మెట్‌పల్లి బల్దియా పరిధిలోని 26 వార్డుల్లో రహదారులు అధ్వానంగా మారాయి. చిన్నపాటి వర్షం పడితే చాలు మురుగు, వర్షం నీరంతా రహదారులపైకి రావడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. 54,335 జనాభా కలిగిన మెట్‌పల్లి బల్దియాలో సుమారు 78 కి.మీ మురుగుకాల్వలు, 132 కి.మీ సీసీరోడ్లు ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పడుతున్న కాలనీలతో పాటు శివారు కాలనీలలో రహదారులు, మురుగుకాల్వలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

పట్టణంలోని వీధుల్లో సీసీరోడ్లు పూర్తిగా ధ్వంసమై ప్రజలు రాకపోకలకు నరకయాతన పడుతున్నారు. మిషన్ భగీరథ పనుల కోసం రహదారులను తవ్వి వదిలేయడంతో గుంతలుగా మారాయి. ఏళ్ల కిందట వేసిన సీసీ రహదారులు కంకరతేలి గుంతలమయంగా మారాయి. చిన్నపాటి వర్షానికి నీరు గుంతలలో చేరడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. గ్రామపంచాయతీ ఉన్న సమయంలో నిర్మించిన కాల్వలు కావడంతో చిన్నపాటి వర్షానికి నిండి మురుగు రోడ్లపైకి వస్తోంది. కాల్వలు కూలిపోతున్నా అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తెచ్చి పెడుతున్నాయి. పట్టణంలోని కళానగర్, ఇందిరానగర్, మఠంవాడ, బోయవాడ చైతన్యనగర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాలలో మురుగుకాల్వలపై స్లాబుల సిమెంట్ ఊడి ఇనుపచువ్వలు బయటకు వచ్చి ప్రమాదకరంగా మారాయి. పట్టణంలోని పలు వార్డులలో సీసీరోడ్లు, మురుగుకాల్వల నిర్మాణంతో పాటు ప్యాచ్ వర్కులు, మురుగుకాల్వల కోసం రూ.10 కోట్ల టీయూఎఫ్ఐడీయూసీ నిధులు మంజూరై టెండర్లు కూడా పూర్తి చేశారు. మురుగుకాల్వల నిర్మాణానికి రూ.4 కోట్లు, సీసీరోడ్లకు రూ.2.50 కోట్లు మంజూరై టెండర్లు పూర్తి చేశారని త్వరలో పనులు ప్రారంభిస్తారని ఏఈ అరుణ్‌కుమార్ తెలిపారు.

# అడుగడుగునా నిర్లక్ష్యం!

కరీంనగర్ : నగరపాలక సంస్థ పరిధిలో 38 ఎంఎల్‌డీల సామర్థ్యం గల భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని (యూజీడీ) రూ.76.50 కోట్లతో నిర్మించి.. సుమారు 275 కిలోమీటర్ల పొడవునా పైపులైను వేశారు. ఎస్టీపీకి సమీపంలోని 4,500 ఇళ్లకు అనుసంధానం చేశారు. గత ఆరేళ్లుగా రెండు, మూడు ఎంఎల్‌డీల నీటిని మాత్రమే శుద్ధి చేస్తున్నారు. 41 వేల ఇళ్ల నుంచి మురుగునీటిని తరలించి శుద్ధి చేసే సామర్థ్యం ఉండగా.. ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు.

**శుద్ధి కేంద్రంతోనే 'స్మార్ట్' గుర్తింపు**

భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రం ఉండడంతోనే నగర పాలక సంస్థకు 'స్మార్ట్‌సిటీ' గుర్తింపు లభిస్తోంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకులు, వాటర్‌ం, ఓడీఎఫ్‌ంలు, సఫాయిమిత్ర సురక్ష ఛాలెంజ్ అవార్డులతోపాటు నగదు పురస్కారం అందుకోగా.. స్మార్ట్‌సిటీ ఎంపికకు ఇదే ప్రధానంగా నిలిచింది. మురుగునీటిని శుద్ధి చేస్తున్నట్లుగా ప్రాజెక్టులో చూపించగా.. మిగతా పనులు పూర్తి చేసేందుకు కావాల్సిన



నిధులకు ప్రణాళికలు చేశారు.

**నిర్వహణ ఏదీ?**

సుమారు 120 కిలోమీటర్ల పొడవునా కొత్తగా రహదారులు, డ్రైనేజీలు నిర్మించారు. సీఎంఏ కింద రోడ్లు వేశారు. ఈ రహదారుల మధ్యలో భూగర్భ డ్రైనేజీ పైపులైను ఉండగా.. వంద మీటర్లకు ఒక ఛాంబర్ కూడా ఉంది. ఇన్‌స్పెక్షన్ ఛాంబర్ కట్టి రహదారికి ఇరువైపులా ఉన్న ఇళ్లకు అనుసంధానం చేయాల్సి ఉండగా.. అదేదీ కనిపించడం లేదు. పైగా రోడ్లు వేసే సమయంలో మధ్యలో ఉన్న ఛాంబర్లు మూసుకుపోయినా నిర్లక్ష్యం వహించారు. ఇటీవల ఇళ్ల ముందున్న బహిరంగ మురుగునీటి కాలువలు మూసివేసి, కొత్తగా యూజీడీ అని చెబుతూ నిర్మిస్తున్నారు. ఛాంబర్‌కు కనెక్షన్ ఇవ్వకుండా, వర్షం నీటి కోసం ఓపెన్ డ్రైనేజీలు వదిలిపెట్టకుండా అధికారులు ప్రజాధనం వృథా చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి.

**సామర్థ్యం ఉన్నా..!**

నగరానికి అత్యంత ప్రధానమైన మురుగునీటి శుద్ధి కేంద్రానికి ఆశించిన స్థాయిలో మురుగునీరు రావడం లేదు. కొన్ని ఇళ్ల నుంచి వస్తున్న నీటితోపాటు సమీప వరద కాలువలోని నీటిని తీసుకొని శుద్ధి చేస్తున్నారు. ఇన్‌స్పెక్షన్ ఛాంబర్లు నిర్మించాలంటే ప్రతి ఇంటికీ సుమారు రూ.7 వేల ఖర్చు వస్తుండడంతో అలాగే వదిలేశారు.

**రూ.కోట్లు కేటాయించినా..**

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం, ఇంటింటా కనెక్షన్లు(హెచ్‌ఎస్‌సీ), ఇన్‌స్పెక్షన్ ఛాంబర్లు(ఐసీ) నిర్మించేందుకు రూ.26కోట్లు కేటాయించారు. అయితే 28 శాతం పనులు చేసినట్లు, 25 శాతం నిధులు గుత్తేదారుకు చెల్లించినట్లు చూపిస్తుండగా.. ఇంటింటా కనెక్షన్లు మాత్రం ఇవ్వలేదు. ప్రస్తుతం రహదారుల నిర్మాణ పనులన్నీ పూర్తికాగా.. మిగతా పనులు చేసేందుకు ముందుకొచ్చినా రోడ్లు దెబ్బతినే ప్రమాదముంది.

**కొనసాగుతున్న పనులు..**భూగర్భ డ్రైనేజీకి ఇంటింటా కనెక్షన్లు ఇచ్చే పనులు కొన్నిచోట్ల కొనసాగు తున్నాయి. డ్రెయిన్లకు అనుసంధానం చేసేలా ఆదేశాలిచ్చాం. ఇప్పటివరకు బిల్లులు ఇవ్వలేదు. ప్రఫుల్ దేశాయ్, కమిషనర్, కరీంనగర్ నగరపాలక

# అమ్మినవే..మళ్లీ అమ్మకం!

ఆలేరు : ప్రభుత్వాలు ఎన్ని కఠిన నిబంధనలు అమలు చేస్తున్నప్పటికీ.. స్థిరాస్తి వ్యాపారుల అక్రమాలకు కళ్లెం పడటం లేదు. వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఇక్కట్లు తప్పడం లేదు. గతంలో రైతుల నుంచి భూములను కొనుగోలు చేసిన రియల్టర్లు.. రెవెన్యూ దస్త్రాలు, ధరణిలో స్థల యజమానుల పేర్లు మారకపోవడంతో..స్థిరాస్తి వ్యాపారులు అమ్మిన వాటినే మళ్లీ అమ్ముతూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. పుణ్యక్షేత్రమైన యాదాద్రి ఆలయంతో పాటు హైదరాబాద్- భూపాలపట్నం, చౌటుప్పల్-సంగారెడ్డి జాతీయ రహదారులు విస్తరించి ఉండటం, ఉత్తర పశ్చిమ సరిహద్దుల్లో గ్రేటర్ హైదరాబాద్‌కు సరిహద్దుగా ఉండటంతో ఆలేరు నియోజకవర్గంలో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. స్థిరాస్తి వ్యాపారులు సైతం ఇదే తీరున అక్రమాలకు పాల్పడుతున్నారు. వ్యాపారులు గతంలోనే పెద్ద ఎత్తున భూములు కొనుగోలు చేశారు. వెంచర్లు ఏర్పాటు చేశారు. కాగితాల పైన లేఅవుట్లు చేశారు. ఆనక అందమైన బ్రోచర్లు ముద్రించి పల్లె, పట్టణం అనే తేడా లేకుండా కొనుగోలు దారులను నమ్మిస్తూ, ఆకర్షిస్తూ పెద్ద ఎత్తున విక్రయాలు జరిపారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ..కొన్ని వెంచర్లకు సంబంధించి ప్రభుత్వం పరంగా ఎలాంటి సాంకేతిక అనుమతులు తీసుకోలేదు. అడ్డదారుల్లో ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

నాలా కన్వర్షన్ లేకుండానే...

వ్యవసాయ భూములను వ్యవసాయేతర పనులకు వినియోగించుకునే క్రమంలో నాలా అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇక్కడ మాత్రం కొంతమంది నాలా అనుమతుల కోసం దరఖాస్తులే చేయడం లేదు. సదరు రైతుల భూములు రెవెన్యూ రికార్డులలో అలాగే ఉండిపోతున్నాయి. ఇదే సదరు స్థిరాస్తి వ్యాపారులకు వరంలా మారుతోంది. వారి అక్రమాలకు ఊతం ఇస్తోంది. ఇలాంటి ఆలేరు నియోజకవర్గం పరిధిలోని మండలాల్లో వందకు పైగా వెంచర్లు ఉన్నట్లు సమాచారం.

ఇప్పుడు ఫామ్ హౌస్‌లు

పది, పదిహేనేళ్ల క్రితం ప్రభుత్వ అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు కాగా..గత నాలుగైదు సంవత్సరాలుగా తిరిగి ఇవే స్థలాలు కొత్త వెంచర్లుగా ఏర్పాటు అవుతున్నాయి. హైదరాబాదు, రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన బడా స్థిరాస్తి వ్యాపారులు సదరు స్థలాలను తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఫామ్‌హౌజ్‌లు నిర్మించుకున్నారు. ఆయా స్థలాల చుట్టూ ప్రహరీలు నిర్మించి అందులో భవనాలు సైతం నిర్మించారు.

ఎప్పుడైనా చర్యలు తప్పవు:

శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దారు, ఆలేరు

నిబంధనలకు అనుగుణంగానే భూములు, పాట్ల క్రయవిక్రయాలు జరుపుకోవాలి. ప్రభుత్వ పరంగా అనుమతులు పొందకుండా విక్రయాలు జరపడం, నిర్మాణాలు చేపట్టడం నేరమవుతుంది. ఇలాంటి వారి విషయంలో కఠిన చర్యలు తప్పవు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ భూములు, ప్లాట్లను కొనుగోలు చేసే ముందు ఆయా ఆస్తులు సరైనవేనా..అనే విషయాన్ని నిర్ధారించుకోవాలి.

# యోగా శిక్షణ.. తప్పని నిరీక్షణ

భువనగిరి : ప్రస్తుతం నిత్యం ఉరుకులు, పరుగుల జీవితం. భార్యాభర్త ఇరువురూ పనిచేస్తేగాని కుటుంబం గడవని రోజులివి. ఈ తరుణంలో మానసిక ప్రశాంతత కొరవడి చాలామంది అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇందుకు ఇటీవల కాలంలో వ్యక్తుల జీవన విధానంలో చాలా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆహారంతో పాటు నిత్య విధివిధానాల్లో తగు జాగ్రత్తలు పాటిస్తున్నారు. మరికొందరు ధ్యానం, యోగా తదితర అంశాలపట్ల మొగ్గు చూపుతున్నారు. నిపుణులైన బోధకులు లేని కారణంగా రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో తర్ఫీదు పొందుతున్న వారు జిల్లాలో ఎందరో ఉన్నారు. ముఖ్యంగా శారీరక శ్రమకు దూరమవుతూ మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ లాంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్న వారిని నివారించే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఏడాదిక్రితం యోగా కేంద్రాల ఏర్పాటుకు పూనుకుంది. ప్రజల్లో ఒత్తిడి తగ్గించుకోవడానికి నిపుణుల తో శిక్షణ ఇస్తే ప్రయోజనం ఉంటుందని భావించింది. ఈ విషయమై జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఉపకేంద్రాలకు అనుబంధంగా 'జాతీయ ఆయుష్ మిషన్' ద్వారా యోగా (ఆరోగ్య స్వస్థత) కేంద్రాలను ఏర్పాటు చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చి యోగా గురువులుగా నియమించాలని నిర్ణయించారు. కానీ ఆ ప్రక్రియ పూర్తి కాక ముందే ప్రభుత్వం మారడంతో శిక్షకుల నియామకం మళ్లీ మొదటికి వచ్చింది.

మొదటి విడతలో పదమూడు..



జిల్లాలో మొత్తం 17 మండలాలుండగా 21 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. వీటిలో మొదటి విడతగా 13 యోగా కేంద్రాల నిర్మాణానికి నిధులను రెండేళ్ల క్రితం ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో కేంద్రానికి రూ.6 లక్షల చొప్పున మొత్తం రూ.78 లక్షలు కేటాయించారు. జిల్లాలోని ఆత్మకూర్ (ఎం), బీబీనగర్, బొల్లేపల్లి, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, కొలనుపాక, చౌటుప్పల్, రాజపేట, చిన్నకందుకూరు, రామన్నపేట, సర్వేల్, రాయగిరి, వెల్లంల ప్రాంతాల్లో వీటి నిర్మాణానికి పూనుకున్నారు. ముఖ్యంగా వీటిని ఆరోగ్యకేంద్రాలు, ఉపకేంద్రాల ఆవరణలో నిర్మాణాలు చేపట్టారు. యోగా కేంద్రాల భవన నిర్మాణాలు పూర్తయి ఏడాది కావొస్తున్నా వాటిని వినియోగంలోకి తేవడంలేదు. ఫలితంగా అవి నిరుపయోగంగానే ఉన్నాయి.గురుముఖంగా నేర్చుకోవాలని తపన..

ధ్యానం, యోగా, ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత పొందుతున్నాను. ధ్యానం, యోగా అంటే అమితమైన ఆసక్తి. యూట్యూబ్ ద్వారా చూసి నిత్యం కొన్ని యోగాసనాలు, ధ్యాన ప్రక్రియలు చేపడుతుంటాను. ఈ రంగాలపై అనేక సందేహాలు వస్తుంటాయి. గురువు సమక్షంలో నేర్చుకుంటే సందేహాలు నివృత్తి చేయడమే కాకుండా మరింత ఫలితం పొందవచ్చని ఆశిస్తున్నాను. ప్రభుత్వం త్వరగా యోగా కేంద్రాలు వినియోగంలోకి తెస్తే మాలాంటి వారికి బహుళ ప్రయోజన కరంగా ఉంటుంది.

బోగ జ్ఞానేందర్, రాజపేట

ప్రభుత్వ నిర్ణయం తదుపరి కార్యాచరణ

ప్రభుత్వం శిక్షకుల నియామకం చేపట్టిన తదుపరి యోగా కేంద్రాల్లో తర్ఫీదు ఉంటుంది. ఈ విషయమై శాఖాపరంగా గతంలోనే ఉన్నతాధికారులకు నివేదించాం. ఈ యోగా కేంద్రాలను వినియోగంలోకి తెస్తే ఆరోగ్యపరంగా మేలు జరుగుతుంది. ముఖ్యంగా వ్యక్తిగత ఆరోగ్యంపైన మరింత శ్రద్ధ పెరుగుతుంది.

స్వాతి, ఇన్‌ఛార్జి వైద్యురాలు

శిక్షకుల నియామకంపై స్పష్టత రాని వైనం..

అప్పట్లో ఒక్కో యోగా కేంద్రానికి ఇద్దరు శిక్షకులను నియమించను న్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మహిళలు, పురుషులకు వేర్వేరుగా శిక్షకులను నియమిస్తారని చెప్పారు. నియామకాల ప్రక్రియపై ప్రభుత్వ పరంగా స్పష్టత రావాల్సిన అవసరం ఉంది. యోగా, ధ్యానం పట్ల ఆసక్తి కలిగిన వారికి నిపుణుల నియామకంతో తర్ఫీదు పొందుతామని ఆశించిన వారికి నిరాశే మిగిలింది.

## పచ్చందాలకు.. ప్రత్యేక కార్యాచరణ

మెదక్: పర్యావరణ పరిరక్షణలో వృక్షాలే కీలకం. వీటి వల్లే ఆహ్లాదకర వాతావరణంతోపాటు, వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. ముఖ్యంగా అడవుల్లో మొక్కలు నాటి వాటిని పెంచితే భారీ వర్షాలు కురిసి భూగర్భజలాలు పెరిగి పంటలు బాగా పండేందుకు ఆస్కారం ఉంటుంది. ఒకప్పుడు ఎక్కడ చూసినా భారీ చెట్లు కనిపిస్తుండేవి. కాని కొందరి స్వార్థం కోసం వాటిని నరికివేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగా పల్లెవనాలుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన నర్సరీలు సత్ఫలితాలను ఇస్తోంది. పంచాయతీరాజ్, ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీల్లో మొక్కలను పెంచారు. వీటిని వివిధ చోట్ల నాటేందుకు ఆయా ప్రభుత్వ శాఖలకు బాధ్యతలను అప్పగించారు. భారీ వర్షాలు కురిసిన వెంటనే నాటేందుకు సిద్ధం అవుతున్నారు.

పర్యవేక్షణతోనే...: నర్సరీల నిర్వహణ, గుంతల తవ్వకం, మొక్కల సరఫరాపై అధికారుల పర్యవేక్షణ నిరంతరం సాగుతోంది. ఉపాధి హామీ అధికారులు, పంచాయతీ రాజ్, ప్రజాప్రతినిధులు పర్యవేక్షిస్తుంటారు. మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవో, ఎంపీపీలు, గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ మేట్లు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సిబ్బందికి సూచనలు ఇస్తూ వస్తున్నారు. జిల్లాలో 469 పంచాయతీల్లో నర్సరీలను గతంలో ఏర్పాటు చేశారు. వాటిలో ప్రతి ఏటా మొక్కలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వర్షాకాలంలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 18 లక్షలకు పైగా మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అలాగే మిగతా శాఖలు 9 లక్షలు నాటేందుకు ప్రణాళికలు తయారు చేశారు. అన్ని శాఖలు కలిపి 27,87,000 నాటనున్నారు. ఇందుకోసం ఇప్పటి వరకు 27,473 గుంతలను తవ్వారు. ప్రస్తుతం నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే గ్రామాలు, పాఠశాలల్లో నాటనున్నారు. గ్రామాల్లో ప్రజలు కోరుకున్న వాటిని అందివ్వనున్నారు. ఈ సారి ప్రభుత్వం పక్కాగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళిక తయారు చేసింది. నాటిన ప్రతి మొక్కను పెంచేలా చూస్తున్నారు. వీటితో పాటు నార్సింగి మండలం వల్లూరు, మెదక్ మండలం పాతూరు, వెల్దుర్తి మండలం శెట్టిపల్లి తదితర అటవీ నర్సరీల్లో పెద్ద ఎత్తున మొక్కలను సిద్ధం చేసి ఉంచారు. వీటిలో తయారు చేసిన మొక్కలను అటవీ ప్రాంతాలు, రహదారుల పక్కన ఎక్కువగా నాటుతుంటారు.

# వనరుల పరిరక్షణకు కార్యాచరణ



పెద్దపల్లి : చెరువులు, నీటి కుంటలు పెద్ద ఎత్తున ఆక్రమణకు గురవుతున్నాయి. మురుగు, రసాయనాలతో కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. గతంలో నీటి వనరుగా ఉపయోగపడిన చెరువులు ప్రస్తుతం చాలా చోట్ల మురుగు నిల్వకు కేంద్రంగా మారాయి. ఈ క్రమంలో చెరువుల పునరుద్ధరణపై ప్రభుత్వం దృష్టి సారించింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను కాపాడుకునేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు పురపాలక శాఖకు బాధ్యత అప్పగించింది. తటాకాల పరిరక్షణకు కృషి చేస్తున్న సంస్థలు, వివిధ రంగాల నిపుణులు, రాష్ట్రంలోని కమిషనర్లతో పురపాలక శాఖ సమీక్షలు నిర్వహించింది. పురపాలక, నీటిపారుదల, రెవెన్యూ శాఖలకు చెందిన ఇంజినీర్లు, అధికారులతో సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

ఆక్రమణలో 30 శాతం వనరులు

కేంద్ర జలశక్తి శాఖ గతేడాది నిర్వహించిన ఓ అధ్యయనం ప్రకారం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 30 శాతం చెరువులు, 40 శాతం కుంటలు ఆక్రమణలకు గురైనట్లు తేలింది. కరీంనగర్, రామగుండం, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల, వేములవాడ వంటి పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువ శాతం కబ్జాలు జరిగినట్లు వెల్లడించింది. ఓవైపు ఆక్రమణలతో చెరువులు కుచించుకుపోగా మరోవైపు మురుగును నేరుగా తటాకాల్లోకే మళ్లిస్తున్నారని నివేదికల్లో తేలింది. సర్వేలో ఇలాంటి చెరువులను గుర్తించి అవసరమైన చోట్ల మురుగు శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీలు) నిర్మించేలా చర్యలు తీసుకోవాలని పురపాలక అధికారులకు ఆదేశాలు అందాయి.

నెలాఖరులోగా పూర్తికి ఆదేశాలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 4,283 చెరువులున్నాయి. అంతటా కలిసి 2 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టున్నా 1.27 లక్షల ఎకరాలకు, అది కూడా ఒక పంటకు మాత్రమే నీరందేది.

గత ప్రభుత్వం మిషన్ కాకతీయ కింద మొత్తం రూ.741.18 కోట్లతో 1,833 చెరువులను పునరుద్ధరించగా నీటి నిల్వ సామర్థ్యం 19.93 టీఎంసీలకు పెరిగింది.

అయితే కొన్ని చెరువులు కళ తప్పాయి. మరికొన్ని చోట్ల ఆక్రమణకు గురయ్యాయి. పశువులు, కోళ్ల వ్యర్థాలు, మురుగుతో కాలుష్య కాసారాలుగా మారాయి.

ఈ నేపథ్యంలో నాలుగు జిల్లాల పరిధిలో ముందు నగర, పట్టణ ప్రాంతాల్లోని చెరువులను ఎంపిక చేసి ఐఐటీ, స్వచ్ఛంద సంస్థల నిపుణుల సమష్టి భాగస్వామ్యంతో సమగ్ర సర్వే నిర్వహించనున్నారు. జూన్ నెలాఖరులోగా పూర్తి చేయాలని పురపాలిక కమిషనర్లకు బాధ్యత అప్పగించారు.

ప్రతి పట్టణంలో ఎన్ని చెరువులున్నాయి? వాటి గరిష్ఠ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్) ఎంత? బఫర్ జోన్ ఎంత? ఆక్రమణలున్నాయా? ప్రస్తుత పరిస్థితులు ఏమిటి? చెరువుల్లోకి వ్యర్థ జలాలు, కాలుష్య కారకాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి? తటాకాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? తదితర విషయాలపై సర్వే చేయాలని పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది.

ఈ విషయమై పెద్దపల్లి పురపాలక కమిషనర్ ఆకుల వెంకటేశ్‌తో మాట్లాడగా ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. మిగిలిన శాఖలతో సమన్వయం చేసుకొని కార్యాచరణ చేపట్టామన్నారు.

# శుభ్రత కనుమరుగు.. తప్పదు ముప్పు



నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలోని పురపాలికల్లో నాలాలు, వరద, మురుగుకాల్వలు అధ్వానంగా మారాయి. వ్యర్థాలు పేరుకుపోయి దిగువకు నీరు పారడం లేదు. ఏటా వేసవిలో పూడిక తీసి వర్షాకాలంలో మురుగు నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో ఈ పరిస్థితులు లేకపోవడంతో వరద నీరు రోడ్లపై ప్రవహించి లోతట్టు ప్రాంతాలను జలమయంగా మారుస్తున్నాయి. వరదల కారణంగా ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. వర్షాలు కురుస్తున్నా కొన్ని పురపాలికల్లో కాల్వల శుభ్రతపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

పురపాలికల్లో పరిస్థితి ఇలా..

ఉమ్మడి జిల్లాలో 19 పురపాలికల్లో వందల కి.మీ. వరద కాల్వలు నిర్మించినా వానాకాలం వచ్చిందంటే ప్రజలకు వణుకు తప్పడం లేదు. సూర్యాపేట పురపాలికలో ఇటీవలే కాల్వల పూడిక తీత పనులు ప్రారంభించగా పూర్తిస్థాయిలో వ్యర్థాలు తొలగించలేదు. దీంతో మురుగు దిగువకు పారకుండా కాల్వల్లోనే పేరుకుపోతోంది.

మిర్యాలగూడ పట్టణంలో 32కి.మీ. మేర నల్లాలు ఉండగా కొన్నేళ్లుగా వ్యర్థాలు తొలగించడం లేదు. దీంతో కాల్వలు చాలా చోట్ల దెబ్బతిన్నాయి. వాటిల్లో ఈసారి రూ.50 లక్షల వ్యయంతో పూడిక తీసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు.

నల్గొండ పట్టణంలో ఈసారి అంతర్గత కాల్వలను మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయిస్తున్నారు. రూ.5 లక్షల వ్యయంతో మేజర్ కాల్వల్లో పూడిక తీసేందుకు ప్రణాళిక తయారు చేశారు.

చండూరు పురపాలిక పరిధిలో రోడ్డు విస్తరణ పనుల కారణంగా వరద కాల్వ నిర్మాణ పనులు చేపట్టారు. గుంతలు తవ్వి మధ్యలోనే అసంపూర్తిగా వదిలేయడంతో మురుగు దిగువకు పారకపోవడంతో సమీప ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

తిరుమలగిరి పురపాలికలో ఇప్పటి వరకు అధికారులు కాల్వల్లో పూడికతీత పనులపై దృష్టి సారించలేదు. రెండు కాల్వలు వ్యర్థాలతో నిండిపోయాయి.కోదాడ పట్టణంలో ఎర్రకుంట కాల్వ పూడిక తీయకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయింది.

హుజూర్‌నగర్ పట్టణంలో పూడిక తీత పనుల్లో జాప్యం నెలకొంది. దద్దనాల చెర్వు కాలనీ ముంపు బారిన పడుతోంది.

మోత్కూరు, యాదగిరిగుట్ట, ఆలేరు, హాలియా, నందికొండ, పోచంపల్లి, చిట్యాల పట్టణాల్లో నిర్వహణ లేమితో చాలా చోట్ల కాల్వలు శిథిలావస్థకు చేరాయి.

పనులు ప్రారంభించాం

నల్గొండ పట్టణంలో మురుగుకాల్వలు, వరద కాల్వల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే వన్‌టౌన్ పరిధిలో మున్సిపల్ సిబ్బందితో కాల్వలు శుభ్రం చేయించాం. టౌన్ టూలో పూడికతీత పనులు కూడా ప్రారంభిస్తాం. రూ.5లక్షల వ్యయంతో పెద్ద కాల్వల్లో పూడిక తీత పనులు చేయిస్తున్నాం. ప్రాణనష్టం జరగకుండా అన్ని వర్గాల ప్రజలతో ఇప్పటికే సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాం. ముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్ నల్గొండ పురపాలిక

# ఉద్యాన సాగుకు ఊతమేదీ?

సంగారెడ్డి : విత్తు నాటగానే వరుణుడి కటాక్షం కోసం ఆకాశం వైపు చూడాలి.. మొలకెత్తింది మొదలు పంటకు చీడపీడల నివారణ.. చేను కోతకొచ్చి ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేదాకా అన్నదాతలకు కష్టాలే. గిట్టుబాటు ధర దక్కితేనే ఆరుగాలం శ్రమకు ఫలితం ఉంటుంది. మెరుగైన దిగుబడులు, గిట్టుబాటు ధర దక్కేలా రైతులను సరైన బాటలో నడిపించేది క్షేత్రస్థాయి సిబ్బందే. నియోజకవర్గానికి ఒక్కరు చొప్పున కూడా క్షేత్రస్థాయి సిబ్బంది లేకపోవడంతో ఉద్యాన రైతులు ఎదుర్కొంటున్నారు.

గతంలో 12 మంది.. ఇప్పుడు నలుగురే..: గతంలో శాశ్వత ఉద్యోగులతో కలిసి 12 మంది క్షేత్రస్థాయిలో అన్నదాతలకు సలహాలు, సూచనలు ఇచ్చేవారు. పొరుగుసేవల పద్ధతిలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యాన విస్తరణ అధికారులు, ఐదుగురు సూక్ష్మ సేద్య విస్తరణ అధికారులను నాలుగేళ్ల కిందట తొలగించడంతో ప్రస్తుతం శాశ్వత పద్ధతిలో పనిచేస్తున్న ఐదుగురు ఉద్యాన అధికారులు మాత్రమే మిగిలారు. ఇందులో ఒకరు కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా క్షేత్రస్థాయి విధుల్లో ఉండేది నలుగురు మాత్రమే.

నెరవేరని ప్రభుత్వ లక్ష్యం: ఉద్యాన పంటల సాగుతో మెరుగైన ఫలితాలు ఉంటాయి.. అంటూ రైతులను ప్రభుత్వం అన్నదాతలను ప్రోత్సహిస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఉద్యాన పంటల సాగు చేసే రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చే వారు కరవయ్యారు. పంటలకు చీడలు సోకితే ఏం చేయాలో తెలియడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవగాహన లేక.. ఇష్టారీతిన పురుగుల మందులు పిచికారీ చేయాల్సి వస్తోందని, దీనివల్ల ఒక్కోసారి ప్రతికూల ఫలితాలతో నష్టపోతున్నామని రైతులు పేర్కొంటున్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి దూరం: జిల్లాలో గుమ్మడిదల, సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్, జహీరాబాద్, హత్నూర, మొగుడంపల్లి, కోహీర్ తదితర మండలాల్లో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. రైతులు పండించిన పండ్లు, పూలు, కూరగాయలను జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో జరిగే సంతల్లో విక్రయిస్తుంటారు. ఇక్కడి నుంచే జిల్లాకు సమీపంలోని హైదరాబాద్‌కు తరలిస్తుంటారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో ప్రారంభించిన యాంత్రికీకరణ పథకానికి అరకొర నిధులతో సరిపెడుతున్నారు. దీంతో రైతులు యంత్ర పరికరాలను కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో పాత పద్ధతిలోనే ముందుకుసాగుతున్నారు.

ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం –సోమేశ్వర్‌రావు, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి. ఉద్యాన రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. అందుబాటులో ఉన్న క్షేత్ర స్థాయి సిబ్బందితో సేవలందిస్తున్నాం. సీజన్‌కు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం. రైతులకు ఏమైనా పంటల సాగులో సందేహాలు ఏమైనా ఉంటే ఉద్యాన అధికారులను సంప్రదించాలి.

# కొండెక్కిన కూరగాయలు

ఖమ్మం : కూరగాయల ధరలు కొండెక్కుతున్నాయి. ఖమ్మంలోని హోల్‌సేల్ వ్యవసాయ మార్కెట్ నుంచి ఖమ్మం నగరం, మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు, ఏన్కూరు, కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ములుగు, సూర్యాపేట, నల్గొండ, మహబూబాబాద్, ఏపీలోని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల వ్యాపారులు కూరగాయలు కొంటారు. ప్రస్తుతం ఖమ్మం రైతుబజార్లలోనే ఎక్కువ ధరలు పలుకుతుంటే మిగతా ప్రాంతాల్లో చిరువ్యాపారుల దగ్గర మరింత మండిపోతున్నాయి.

వేసవి ప్రభావం వేసవి కారణంగా దిగుబడులు తగ్గిపోవటం ధరలపై కొంత ప్రభావం పడింది. ఖమ్మం టోకు విపణికి సీజన్‌లో రోజుకు 800–900 క్వింటాళ్ల కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం రోజుకు 400– 500 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయి. వీటిలో కొన్నింటిని ఏపీ, బెంగళూరు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి టోకు వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు.

దుంప కూరలూ ఎక్కువే..

కిలో ఆలుగడ్డ రూ.40, చామగడ్డ రూ.46, క్యారెట్ రూ.50, బీట్‌రూట్ రూ.36 చొప్పున ధరలు పలుకుతున్నాయి.

ఇవి.. కొద్దిగా పర్వాలేదు..

కిలో బెండ రూ.30, దొండ రూ.24, సొరకాయ రూ.30, వంకాయ రూ.18, దోస రూ.30, క్యాబేజి రూ.26.

చిక్కుదు గోరుచిక్కుడు..

15 రోజుల క్రితం గోరుచిక్కుడు కిలో ధరలు రూ.26 నుంచి రూ.30 ఉన్నాయి. ప్రస్తుతం కిలో రూ.58కి పెరగటంతో వినియోగదారులు కొనలేకపోతున్నారు.

ఠారెత్తిస్తున్న భగ్గుమంటున్న పచ్చిమిరప

నెల రోజులుగా పచ్చిమిరప ధరలు భగ్గుమంటున్నాయి. రెండు రోజుల క్రితం కిలో రూ.58 ఉంటే.. ఇప్పుడు మళ్లీ కిలో ధర రూ.70 పలుకుతోంది. అయినా విపణిలో సరకు దొరకటం లేదు. చాలా తక్కువ నిల్వలు ఉంటున్నాయి.

టమాట..

కొద్దినెలల పాటు టమాట ధరలు కిలో రూ.30 నుంచి రూ.40 మధ్య స్థిరంగా ఉండేవి. ఇప్పుడు రైతుబజార్లలోనే కిలో రూ.64 వరకు పలుకుతోంది. బహిరంగ విపణిలో చిరు వ్యాపారులు రూ.75కు విక్రయిస్తున్నారు.

కాకరా.. మజాకా..

వారం క్రితం కిలో రూ.30 నుంచి రూ.35 వరకు ఉన్న కాకరకాయల ధర ఇప్పుడు అమాంతం పెరిగింది. ప్రస్తుతం పొట్టి రకం కిలో ధర రూ.66, పొడవు రకం రూ.70 వరకు పలుకుతోంది.

కొనలేం.. క్యాప్సికం

క్యాప్సికం కిలో ధర రూ.74 వరకు ఉంది. వినియోగదారులు కొనలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల వరకు కిలో రూ.35 నుంచి రూ.45 వరకు ఉన్న ధరలు ఒక్కసారిగా పెరిగాయి.

వామ్మో బీర

బీరకాయల ధర కిలో రూ.80 వరకు ఉండటంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. వీటి ధరలు ఇంతగా ఎన్నడూ పెరగలేదని వాపోతున్నారు. పక్షం రోజుల వరకు కిలో రూ.30లోపు ఉన్న ధరలు విపరీతంగా పెరిగాయి. సరకు సైతం తక్కువగా ఉంది.

ఆకుకూరలూ పిరం..

కొద్దిరోజుల వరకు రూ.10కి 2 కట్టల చొప్పున ఆకుకూరలు విక్రయించారు. ప్రస్తుతం రూ.20కి 2 లేదా 3 కట్టలు మాత్రమే ఇస్తున్నారు. కొత్తిమీర కట్ట ధర రూ.70కి చేరింది. గతంలో రోజుకు 60–70 కట్టలు విక్రయించిన వ్యాపారులు ఇప్పుడు 10– 20 మాత్రమే తెస్తున్నారు. ధర ఎక్కువగా ఉండటంతో పాడైపోతాయనే భయంతో తక్కువ మొత్తంలోనే తెచ్చి అమ్ముతున్నారు.

## సీతా రామా ..ఇక వడివడిగా ..!

ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ఏడేళ్ల క్రితం సీతారామ ప్రాజెక్టుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2017లో తొలి అడుగు పడినా.. ఇప్పటికీ ప్రాజెక్టు పనుల్లో ఆశించిన పురోగతి కనిపించటం లేదు. తాజాగా లోక్‌సభ ఎన్నికలు ముగియటంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షేత్రస్థాయిలో పనులను గురువారం పరిశీలించనున్నారు.

రంగంలోకి అమాత్యులు పనులు ప్రారంభించిన రెండేళ్లలోనే పూర్తిచేసి సాగునీరందించాలన్నది సర్కారు లక్ష్యం. ఏడేళ్లు గడుస్తున్నా ప్రాజెక్టు పనులు కొలిక్కి రాలేదు. ఆది నుంచే అడ్డంకులు, అవాంతరాలు ఎదురయ్యాయి. భూసేకరణ ప్రక్రియకే దాదాపు రెండేళ్లు పట్టింది. తర్వాత కొవిడ్ మహమ్మారి విజృంభించటంతో పనులు ముందుకు సాగలేదు. తదనంతరం పనులు గాడినపడ్డట్లు అనిపించినా ఆశించిన పురోగతి కనిపించలేదు. 2023లో శాసనసభ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ సర్కారు కొలువుదీరాక ఈప్రాజెక్టుపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించారు. పలుమార్లు సమీక్షలు జరిపి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేయటంతో పనులు మళ్లీ గాడినపడ్డాయి. రాష్ట్రంలో సార్వత్రిక సమరం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ముగియటంతో పాలనపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరిస్తామని సీఎం, మంత్రులు ప్రకటించారు. ఇందులో భాగంగా సీతారామ ప్రాజెక్టు పనులను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించనున్నారు. అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. మరోవైపు సీతారామ ప్రాజెక్టులో భాగంగా ఓచోట రిజర్వాయర్ నిర్మించాలని సర్కారు యోచిస్తోంది. 10– 13 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉండాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై అధికారుల నుంచి ప్రతిపాదనలు కోరింది. మంత్రుల తాజా పర్యటనలో రిజర్వాయర్ నిర్మాణంపైనా కీలక నిర్ణయం వెలువడే అవకాశముంది.

ఇదీ ప్రాజెక్టు స్వరూపం ఖమ్మం జిల్లాలో 4 లక్షలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2 లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో 1.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలు అందించాలనే ఉద్దేశంతో సీతారామ ఎత్తిపోతల పథకానికి రూపకల్పన జరిగింది. ప్రాజెక్టులో మొత్తం నాలుగు చోట్ల పంప్ హౌస్‌లు నిర్మించారు. ఈ ప్రాజెక్టును 16 ప్యాకేజీలుగా విభజించారు. భద్రాద్రి జిల్లాలోని 1– 8 ప్యాకేజీల్లో 114 కి.మీ. పొడవు ప్రధాన కాల్వ నిర్మాణం దాదాపు పూర్తికావొచ్చింది. సత్తుపల్లి ట్రంకు పనులను 9–12 ప్యాకేజీలుగా విభజించారు. కాల్వ పొడవు 116 కి.మీ. ఉంటుంది. యాతాకులకుంట టన్నెల్, గండుగులపల్లి వద్ద నాలుగో పంప్‌హౌస్ పనులు సాగుతున్నాయి. పాలేరు ట్రంక్ పనులను 13– 16 ప్యాకేజీల కింద చేపట్టారు. 79 కి.మీ. పొడవు కాల్వలు నిర్మించాల్సి ఉంది.

## డార్లింగ్ నభా.. పువ్వు లాంటి డ్రెస్సులో ఇలా..

తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సాధించుకున్న నభా నటేష్, 'ఇస్మార్ట్ శంకర్' సినిమా ద్వారా ప్రేక్షకులకు బాగా దగ్గరైంది. రామ్ పోతినేని, పూరీ జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ సినిమా ఆమెకు లైమ్‌లైట్ తీసుకొచ్చింది. 'డిస్కో రాజా', 'సోలో బ్రతుకే సో బెటర్', 'అల్లుడు అదుర్స్' వంటి సినిమాల్లోనూ తన ప్రతిభను నిరూపించుకుంది. కానీ, అనుకోకుండా జరిగిన ప్రమాదం ఆమె కెరీర్‌లో బ్రేక్ తీసుకుంది. సీరియస్ గాయాల వల్ల రెండు సంవత్సరాల పాటు సినిమాలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఆపరేషన్ కూడా చేయించుకున్న నభా, ఇప్పుడు గాయాల నుంచి పూర్తిగా కోలుకుని మళ్లీ తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ప్రస్తుతం నభా నటేష్ రెండు సినిమాల్లో నటిస్తోంది. ఈమధ్య 'డార్లింగ్' అనే సినిమాలో ప్రియదర్శి సరసన నటించింది. ఈ సినిమాలో స్ప్లిట్



పర్సనాలిటీ డిజార్డర్ సమస్యతో బాధపడుతున్న యువతిగా నభా కనిపించింది. ఈ పాత్ర కోసం ప్రత్యేకంగా వర్క్‌షాప్‌లకు హాజరై ట్రైనింగ్ తీసుకుంది. ఆ సినిమాలో అమ్మడి నటనకు మంచి గుర్తింపు కూడా దక్కింది. సినిమా ఫలితం ఎలా ఉన్నా కూడా ఆమె చేసిన పాత్రకు ఆడియెన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మీడియాతో ఇంటరాక్ట్ అయిన నభా, తన గ్లామరస్ లుక్స్‌తో అందరినీ ఆకట్టుకుంది. పువ్వు ఆకారంలో ఉన్న పొట్టి డ్రెస్‌లో సింపుల్ మేకప్‌తో వచ్చిన నభా, ఫ్యాన్స్‌ని కట్టిపడేసింది. ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నభా నటేష్ ఎవరూ రీచుకోలేని అందంగా ఉన్నారని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. నభా నటేష్ నిఖిల్ సరసన 'స్వయంభూ' మూవీలో కూడా నటిస్తోంది. పీరియాడిక్ జోనర్‌లో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రిన్సెస్ పాత్రలో కనిపించనుంది. నభా రీఎంట్రీలో ఈ రెండు సినిమాల ద్వారా ఎలా మెప్పిస్తుందో చూడాలి.

## ఆ హీరో కొడుక్కి కీర్తి సురేష్ రిలేషన్..!

న్యాచురల్ స్టార్ నానితో కీర్తి సురేష్ రెండు సినిమాల్లో నటించింది. మొదట నేను లోకల్ లో నటించిన ఈ ఇద్దరు మళ్లీ దసరాలో కలిసి నటించారు. నాని, కీర్తి సురేష్ అంటే ఆ సినిమా హిట్ అనేలా సెంటిమెంట్ ఏర్పరచుకున్నారు. ఐతే నాని తో సినిమాలు చేస్తున్న టైం లో అతని ఫ్యామిలీతో ముఖ్యంగా నాని కొడుకు అర్జున్ తో కీర్తి సురేష్ చాల క్లోజ్ అయ్యిందట. ఇదే విషయాన్ని ఆమె రీసెంట్ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. జున్ను తనని అత్త అని పిలుస్తాడు.. తనకు హ్యాపీ బర్త్ డే చెప్పినప్పుడు మిస్ యు.. సీ యూ అనే మాటను ముద్దుగా మూసీ సుయీ అంటూ చెబుతాడని. ఎప్పుడైనా తనకు లో అనిపించినప్పుడు ఆ వాయిస్ ఓవర్ వింటానని చెప్పింది కీర్తి సురేష్. ఎప్పుడు హైదరాబాద్ వెళ్లినా జున్ను దగ్గరకు వెళ్తానని కీర్తి సురేష్



చెప్పింది. ప్రస్తుతం కీర్తి సురేష్ నాని ఫ్యామిలీ గురించి ముఖ్యంగా ఆ హీరో తనయుడు అర్జున్ గురించి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇక కీర్తి కెరీర్ విషయానికి వస్తే బాలీవుడ్ లో ఈమధ్యనే వరుస సినిమా ఆఫర్లు అందుకుంటున్న అమ్మడు. అక్కడకు వెళ్లాక గ్లామర్ డోస్ పెంచిందన్న టాక్ వినిపిస్తుంది. ఐతే తెలుగులో దసరా తర్వాత కీర్తి సురేష్ కి ఒక్క ఆఫర్ కూడా రాలేదు. కల్కి సినిమాలో బుజ్జి పాత్రకు తన వాయిస్ ఇచ్చి మెప్పించింది కీర్తి సురేష్. దసరా కాంబినేషన్ లో నాని, శ్రీకాంత్ ఓదెల మరో సినిమా చేయబోతున్నారు. ఒకవేళ హీరోయిన్ గా మళ్లీ కీర్తి సురేష్ నే రిపీట్ చేస్తారా అన్న డౌట్ కూడా ఉంది.

అదే జరిగితే మాత్రం దసరా కాంబో మరో సూపర్ హిట్ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారని చెప్పొచ్చు. అటు తమిళంలో కూడా తన దూకుడు తగ్గించింది కీర్తి సురేష్. బాలీవుడ్ లో వస్తున్న ఆఫర్లు ఆమె కెరీర్ కు ఎంకరేజ్మెంట్ అందిస్తున్నాయి. మరి ఇక్కడ మహానటిగా గుర్తింపు తెచ్చుకుని నేషనల్ అవార్డ్ కూడా అందుకున్న కీర్తి సురేష్ బాలీవుడ్ లో ఎలాంటి క్రేజ్ తెచ్చుకుంటుందో చూడాలి. కీర్తి మాత్రం బాలీవుడ్ లో పాగా వేయాలనే ఉద్దేశంతోనే అక్కడ పర్ఫెక్ట్ ప్లానింగ్ తో సినిమాలు ఓకే చేస్తుందని తెలుస్తుంది.




# ఆ ముగ్గురికి రెస్ట్ ఈ ముగ్గుర్ని దించుతున్నారా?



కార్తీ హీరోగా మిత్రన్ దర్శకత్వంలో స్పై థ్రిల్లర్ సర్దార్ -2 షూటింగ్ ప్రారంభమైన సంగతి తెలిసిందే. భారీ విజయం సాధించిన %-%సర్దార్%-% కి సీక్వెల్ గా ఈ చిత్రాన్నితెరకెక్కించడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా కోసమంటూ ఎదురు చూసే అభిమానులెంతో మంది ఉన్నారు. ఇప్పటికే ఆలస్య మైన నేపథ్యంలో డిలే లేకుండా షూటింగ్ చేస్తున్నారు. మరి ఇందులో హీరోయిన్లు ఎవరు? అంటే ప్రముఖంగా ముగ్గురు భామల్ని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. సాధారణంగా సీక్వెల్ అంటూ వీలైనంత వరకూ మొదటి భాగంలో నటించిన నటీనటులు కొనసాగిం చడానికి అవకాశం ఉంటుంది. కానీ మిత్రన్ ఇక్కడ ఆ ఛాన్స్ తీసుకోలేదు. హీరోయిన్ల విషయంలో ప్రేక్షకులకు ఫ్రెష్ ఫీల్ ని అందించే ఉద్దేశంలో భాగంగా పాత భామల్ని ఎవర్నీ కొనసాగించలేదు. మొదటి భాగంలో రాశీఖన్నా, రజీషా విజయన్, లైలా నటించారు. ఈ పాత్రలు సినిమాలో ఎంతో కీలకమైనవి. కానీ %-%సర్దార్ -2%-% లో వాళ్లని ఎవర్నీ తీసుకోలేదు. వాళ్ల స్థానంలో మాళవికా మోహనన్ ప్రియాంక మోహన్, ఆషీకా రంగనాథ్ ల్ని ఎంపిక చేసినట్లు సమాచారం. ఆషికా రంగనాథ్ ఇప్పటికే తన ఎంట్రీ ఖరారు చేసింది. సినిమాలో కీలకమైన పాత్రకు ఎంపికైనట్లు తెలిపింది. ఇంతవరకూ అమ్మడికి స్పై యాక్షన్ థ్రిల్లర్ లో నటించే ఛాన్స్ రాలేదు. కమర్షియల్ చిత్రాల్లోనే నటిం చింది. తొలిసారి యాక్షన్ స్కోప్ ఉన్న చిత్రంలో ఛాన్స్ రావడంతో అమ్మడి ఆనందానికి అవధుల్లేవ్. నటిగా ఆమెలో కొత్త కోణాన్ని బయటకు తెచ్చే సినిమా అవుతుందని చెప్పొచ్చు. ఇక మోహనన్ లు ఇద్దరు ఇప్పటికే తమిళ్ లో కొన్ని సినిమాలు చేసిన అనుభవం ఉంది. కార్తీతో నటించడం ఇదే తొలిసారి. ఆ భామలు తెలుగు ప్రేక్షకులు సుపరిచితమే.

# యంగ్ యమ సెట్లో జాన్వీ చేసిన పనేంటో తెలుసా?






యంగ్ యమ ఎన్టీఆర్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'దేవర' రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు వస్తుందని ఇంతకుముందే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాని పాన్ ఇండియన్ కేటగిరీలో విడుదల చేసేందుకు కొరటాల బృందం సన్నాహకాల్లో ఉన్నారు. దేవర భారీ యాక్షన్ డ్రామా కథాంశంతో రూపొందుతోంది. ఆసక్తికరంగా ఇలాంటి ఒక ఎగ్జయిట్ చేసే ప్రాజెక్ట్ తో లక్కీ గాళ్ జాన్వీ కపూర్ టాలీవుడ్ లో అడుగుపెడుతోంది. ఈ తెలుగు సినిమాతో దక్షిణాది అంతటా జాన్వీ పరిచయం అయిపోతోంది. ఈ చిత్రంలో జాన్వీ ఎలాంటి పాత్రలో నటిస్తోందో ఇంతకుముందు ఫస్ట్ లుక్ రూపంలో రివీలైంది. తంగం అనే పల్లెటూరి బ్యూటీ పాత్రలో ఈ సుందరి నటిస్తోంది. సగం చీరలో జాన్వీ డి-గ్లామ్ లుక్ కొన్ని నెలల క్రితం విడుదలైంది. కుర్ర బ్యూటీ తన సహజ అందంతో అందరి హృదయాలను దోచుకుంది. దేవర చిత్రీకరణ సమయంలో జాన్వీ కపూర్ సెట్‌లో ఎలా ఉండేది? అంటే ఇదిగో ఈ ఫోటోగ్రాఫ్ చూస్తే అర్థమవుతుంది. సెట్లో జాన్వీ చాలా సరదాగా గడిపినట్లు కనిపిస్తోంది. తాజాగా ఇన్‌స్టాలో తన అభిమానుల కోసం కొన్ని ఆహార పదార్థాల ఫోటోలను షేర్ చేసింది. ఇందులో బిర్యానీ, చికెన్ , శాఖాహార వంటకాలు సహా ఇతర రకాల వంటకాలను ప్రదర్శిస్తూ లంచ్ టైమ్ చిత్రాన్ని పోస్ట్ చేసింది. నేను.. ప్రేమ.. షూటింగ్ కోసం.. దేవర" అని జాన్వీ పోస్ట్ చేసింది. చివర్లో ఫైర్, డ్రూలింగ్, లవ్ ఎమోజీలను కూడా జోడించింది. దీంతో సెట్లో జాన్వీ కపూర్ అదరితో కలిసిపోయిందని అర్థమవుతోంది. ఎన్టీఆర్ సహా ఇతర ఆర్టిస్టులతో కలిసి జాన్వీ ప్రస్తుతం శంషాబాద్‌లో ప్రత్యేకంగా వేసిన సెట్‌లో భారీ డ్యాన్స్ నంబర్ షూట్ లో పాల్గొంటోంది. లొకేషన్ లో ఇలా తారక్ తో కలిసి స్పెషల్స్ అన్నీ లాగించేస్తోందని కూడా అర్థమవుతోంది.

మిక్కిలినేని సుధాకర్, నందమూరి కళ్యాణ్ రామ్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను సంయుక్తంగా నిర్మిస్తుండగా, అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్నారు. ఈ సినిమా మొదటి భాగం సెప్టెంబర్ 27న థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లకు అద్భుత స్పందన వచ్చింది.

## ఆ విషయంలో తల్లిని గుర్తు చేస్తున్న జాన్వీ..

టాలీవుడ్ ఇండస్ట్రీలో తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకొని అతిలోకసుందరిగా అందరి మన్ననలు అందుకున్న నటి శ్రీదేవి. ఈ దివంగత తార కూతురు జాన్వీ కపూర్ బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఎన్టీఆర్ నటిస్తున్న దేవర చిత్రంతో టాలీవుడ్ లో ఈ బ్యూటీ ఎంట్రీ ఇవ్వబోతోంది. అప్పుడే చెర్రీతో రెండవ సినిమాకి లక్కీ ఛాన్స్ కూడా సంపాదించింది. కేవలం గ్లామర్ పాత్రలకే ప్రాముఖ్యత ఇవ్వకుండా కంటెంట్ ఉన్న సినిమాలు చేయడానికి జాన్వీ రెడీగా ఉంటుంది. తాజాగా ఆమె నటించిన ఉలఝ్ చిత్రం రేపు విడుదల కాబోతోంది. సుధాంశు సరియా ఈ మూవీకి దర్శకత్వ బాధ్యతలు వహించారు. గుల్షన్ దేవయ్య, రాజేశ్ థైలాంగ్,అదిల్ హుస్సేన్ ఈ మూవీలో ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం చిత్రానికి సంబంధించిన ప్రమోషన్ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఓ ప్రమోషన్ ఈవెంట్ లో అదిల్.. జాన్వీకపూర్ గురించి కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆదిల్ హుస్సేన్.. శ్రీదేవితో తాను కలిసి నటించిన 'ఇంగ్లీష్ వింగ్లీష్' సినిమా చిత్రీకరణ సమయంలో కొన్ని సంఘటనలను



తిరిగి గుర్తు చేసుకున్నారు. అప్పట్లో షూటింగ్ జరిగే సమయంలో శ్రీదేవితో కలిసి జాన్వీ సెట్స్ కు వచ్చేదట. అంటే సుమారు 13 సంవత్సరాల క్రితం ఆదిల్ జాన్వీ ను కలిశారు. అప్పుడు ఆమె వయసు సుమారు 14 సంవత్సరాలు.. తల్లితోపాటు షూటింగ్ కి వచ్చి ఎంతో జాగ్రత్తగా అన్ని గమనించేదట. బహుశా అందుకే ఆమె అంత అద్భుతంగా నటిస్తుందేమో అని ఆదిల్ అభిప్రాయపడ్డారు. ఉలఝ్ షూటింగ్ సమయంలో జాన్వీ చూపించే డెడికేషన్, సిన్సియారిటీ చూసి తనకు ఆనాటి శ్రీదేవి గుర్తుకు వచ్చిందని ఆదిల్ పేర్కొన్నారు. డైరెక్టర్ ఎలా అయితే ఆశిస్తాడో అలా నటించడం, తాను చేయవలసిన సీన్స్ గురించి ముందుగానే అడిగి తెలుసుకోవడం, తోటి నటీనటులతో ఎంతో గౌరవంగా ఉండడం లాంటి ఎన్నో లక్షణాలు జాన్వీ ఆమె తల్లి నుంచి వారసత్వంగా పొందిందని ఆదిల్ పేర్కొన్నారు.

ఓ మంచి స్పై థ్రిల్లర్ కాన్సెప్ట్ తో ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఉలఝ్ మూవీ లో జాన్వీ 'సుహానా భాటియా అనే ఐఎఫ్ఎస్ అధికారిణిగా కనిపించబోతోంది. వృత్తిపరంగా ఆమెపై తలెత్తిన ఎన్నో విమర్శలు, ఆరోపణలను ఎదుర్కొంటూ తనపై పండిన కుట్ర నుంచి ఆమె ఎలా బయటికి వస్తుంది అనే ఆసక్తికరమైన కథనంతో ఈ మూవీ ముందుకు సాగుతుంది. ఇప్పటికే చిత్రానికి సంబంధించి పలు నగరాలలో ప్రీమియం షోలు పడ్డాయి. ఈ మూవీ లో జాన్వీ నటన అద్భుతంగా ఉందని.. తప్పక చూడాల్సిన సినిమా అని రివ్యూలు కూడా వచ్చాయి. రేపు విడుదల తర్వాత ఈ చిత్రం ఎంతవరకు బాక్సాఫీస్ వద్ద నిలబడుతుందో చూడాలి.

## చాకు లాంటి కుర్రాడితో ఖుషీ ఖుషీగా

అతిలోక సుందరి శ్రీదేవి- బోనీకపూర్ జంట కుమార్తెలు జాన్వీ కపూర్, ఖుషీ కపూర్ డేటింగ్ వ్యవహారాలపై నిరంతరం మీడియాలో గాసిప్స్ షికార్ చేస్తున్నాయి. జాన్వీ కపూర్ ఇప్పటికే పాపులర్ రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన శిఖర్ పహారియాతో డేటింగ్ లో ఉందంటూ ప్రచారం సాగుతోంది. అదే సమయంలో జాన్వీ సోదరి, అతిలోక సుందరి శ్రీదేవి రెండో కుమార్తె ఖుషి కపూర్ కూడా డేటింగ్ లో ఉందని ముంబై మీడియా కథనాలు అల్లుతోంది. ఖుషి ఇప్పటికే వేదంగ్ రైనాతో డేటింగ్ లో ఉందనేది బాలీవుడ్ మీడియా ప్రచారం. తాజాగా స్నేహితుడు వేదాంగ్ రైనాతో ఖుషి కపూర్ ఎలాంటి సందిగ్ధతలు, భేషజాలు లేకుండా జంటగా ర్యాంప్ వాక్ చేసి మురిపించింది. వేదాంగ్ కి ఖుషి సరైన జోడీ అనేంతగా ఆ ఇద్దరి జంట అందరి దృష్టిని ఆకర్షించింది. ర్యాంప్ పై ఆ ఇద్దరి నడుమా



కెమిస్ట్రీ అలాంటి రొమాంటిక్ వైబ్స్ ని వెదజల్లింది. ఈ జంటకు ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ గౌరవ్ గుప్తా దుస్తులను డిజైన్ చేసారు. ఫ్యూచరైజ్డ్ ఎథ్నిక్ ఈస్థెటిక్ - రీఇమాజినింగ్‌ను అరుణోదయ లుక్ ని డిజైన్ చేయడం ద్వారా గౌరంగ్ ఫ్యాషన్ సెన్స్ ఆసక్తిని కలిగించింది. రిలయన్స్ బ్రాండ్స్ లిమిటెడ్, %ఖీణజ×% ఇనిషియేటివ్ అయిన రిలయన్స్ బ్రాండ్స్ లిమిటెడ్‌తో కలిసి నిర్వహించిన ఈవెంట్ లో ఖుషి- వేదాంగ్ రైనా షోస్టాపర్లుగా నిలిచారు. మెర్మైడ్-కట్ హెమ్‌లైన్ - స్టేట్‌మెంట్ సిల్వర్ ఎంబ్రాయిడరీతో స్వెల్ట్ ఐవరీ నంబర్‌ను ధరించి ర్యాంప్‌పై నడిచిన మొదటి నటిగా ఖుషీ రికార్డులకెక్కింది. వేదాంగ్ పాక్షికంగా-సీక్విన్డ్ ఆల్-బ్లాక్ బంద్‌గాలా దుస్తులను ధరించి స్టైలిష్ గా కనిపించారు. ఈ జంట ర్యాంప్ వాక్ సమయంలో అద్భుతమైన కెమిస్ట్రీతో అలరించారు. ఖుషీ- వేదాంగ్ కొంతకాలంగా ఒకరికొకరు సన్నిహితంగా ఉన్నారని ముంబై మీడియా చెబుతోంది. ది ఆర్చీస్ ప్రమోషన్‌ల సమయంలో ఈ జంట పబ్లిక్ ప్రదర్శనలు ఆకర్షించాయి. వారి రొమాంటిక్ డేట్ గురించి మీడియాలో కథనాలొచ్చాయి. కానీ ఈ జంట తమ డేటింగ్ ని ఇంకా ఖరారు చేయలేదు.

# పేదోడి ఆలోచనకు అనుగుణంగా ఇండస్ట్రీయల్ పార్కు





జయశంకర్ భూపాలపల్లి: పేదోడి ఆలోచనకు అనుగుణంగా గాంధీనగర్ ఇండస్ట్రీయల్ పార్కు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రజల దీవెనలతో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వానికి రెండు రెండు కళ్లు, జోడెడ్ల లాగా సాగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటకు ఇన్స్‌రెన్సు, విత్తనాలకు సబ్సిడీ ఇస్తూ రైతులను రాజులుగా చేస్తున్నామని వెల్లడించారు. శనివారం నాడు భూపాలపల్లి జిల్లాలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క పర్యటించారు. గాంధీనగర్ ఇండస్ట్రీయల్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. వనమహోత్సవం కార్యక్రమంలో మంత్రులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు కోరిన విధంగా భూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇస్తామని తెలిపారు. ఈ నెల చివరి వరకు 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన ప్రతి గ్రామానికి ఇస్తామని ఉద్ఘాటించారు. కేసీఆర్ ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇస్తామని ఇదిగో అదిగో అని మాయ మాటలు చెప్పి పదేళ్లలో కేవలం 1.50 లక్షల ఇళ్లను మాత్రమే కట్టిందని.. కానీ తమ ప్రభుత్వం మొదటి విడతలోనే 4.50 లక్షల ఇళ్లు కట్టిస్తుందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ పేరు ఎత్తలేదని, రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం: మంత్రి సీతక్క –** భూపాలపల్లికి ఇండస్ట్రీయల్ పార్క్ రావడం సంతోషకరమని మంత్రి సీతక్క తెలిపారు. ఉద్యోగాల వేటలో చాలా మంది ప్రజలు ఉపాధి కోసం పట్టణాలకు వెళ్తున్నారని చెప్పారు. మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో మారుమూల ప్రాంతాల్లో ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. ఇండస్ట్రీస్ వల్ల భూపాలపల్లి యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని తీసుకువచ్చి ఎందరినో ఇబ్బందులు పెట్టారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమాతను తెచ్చి విజయవంతంగా ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. జాబ్ క్యాలెండర్ తెచ్చామని చెప్పారు. స్కిల్ ఇండియా ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రుణమాఫీ జరిగిందని గుర్తుచేశారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఓకే సారి రూ. 2లక్షల రుణమాఫీ చేశామని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ నేతలు అలా మాట్లాడటం సరికాదు: మంత్రి శ్రీధర్ బాబు –** ప్రభుత్వ బాధ్యతలు విస్మరించకుండా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. భూపాలపల్లి జిల్లాలో నీటి వనరులు, ఖనిజ సంపద ఉందని చెప్పారు. అశాస్త్రీయ బద్ధంగా మేడిగడ్డ బ్యారేజి కడితే కుంగిపోవడం ప్రజలంతా చూశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏదో కుట్ర చేసిందని బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సరికాదని చెప్పారు. అధికారులను ప్రజల వద్దకు తీసుకెళ్లడం కోసం ప్రభుత్వం ముందుకు సాగుతుందని వివరించారు. అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేశామని తెలిపారు. మంత్రి సీతక్క



, సీఎం రేవంత్ రెడ్డి మహిళలను లక్షాధికారులను చేస్తామంటే ప్రతిపక్షాలు విమర్శలు చేశాయని మండిపడ్డారు. ఈ రోజు కోటి మందిని స్వశక్తి మహిళా గ్రూపు సభ్యులుగా చేర్చి మహిళలను లక్షాధికారులు చేయడానికి ప్రణాళికలు రూపొందించామని అన్నారు. ఎమ్మెల్యేలు ఇక్కడ పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి ఎంతో కష్టపడ్డారని అన్నారు. 200 పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. మొట్టమొదటి పరిశ్రమకు శంకుస్థాపన చేస్తామని చెప్పారు. ఐటీ రంగ ఉద్యోగులు కూడా జిల్లాల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు కావాలని కోరుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.





## సీఎంను, నన్ను కించపరచడం వల్లే సహనం కోల్పోయా: దానం నాగేందర్

హైదరాబాద్: అసెంబ్లీలో తనను కావాలని భారాస ఎమ్మెల్యేలు టార్గెట్ చేశారని.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విమర్శించారు. హైదరాబాద్ ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. శాసనసభలో హైదరాబాద్ అభివృద్ధిపై తనకు మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు... భారాస ఎమ్మెల్యేలు ఆటంకం కలిగించారన్నారు. బయటకు చెప్పలేని పదాలతో దూషించారని ఆరోపించారు. వారు మాట్లాడింది మైక్‌లో రికార్డు కాలేదని పేర్కొన్నారు. సీఎంను, తనను కించపరిచే విధంగా మాట్లాడటం వల్లే సహనం కోల్పోయి ఆ వ్యాఖ్యలు చేశానని తెలిపారు. “నేను చేసిన వ్యాఖ్యలు హైదరాబాద్ వాడుక భాషలోవే... అవి ఎవరి కైనా బాధ కలిగిస్తే క్షమాపణ చెబుతున్నా. అధికారం కోల్పోవడం వల్ల భారాస నేతలు ఆవేదనతో రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి వారు సభను సజావుగా జరగకుండా అడ్డంకులు సృష్టించారు. గత పదేళ్లుగా ఏనాడూ నా లాంటి వారికి అసెంబ్లీలో మాట్లాడే అవకాశం రాలేదు. భారాస ఎమ్మెల్యేలు అభివృద్ధికి సహకరించి తమ పద్ధతిని మార్చుకోవాలి” దానం నాగేందర్ తెలిపారు.

## తెలంగాణలో 8 మంది ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్: తెలంగాణలో 8 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టి.కె.శ్రీదేవిని ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్‌గా బదిలీ చేశారు.ాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా రిజ్వీకి అదనపు




బాధ్యతలు అప్పగించారు. విపత్తుల నిర్వహణ విభాగం సంయుక్త కార్యదర్శి ఎస్.హరీశ్‌కు రవాణా, ఆర్‌అండ్‌బీ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా ఉదయ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు కేటాయించారు.

పురపాలక శాఖ ఉపకార్యదర్శిగా ప్రియాంక, హాకా ఎండీగా చంద్రశేఖర్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ ఎండీగా శ్రీనివాస్‌రెడ్డి, రవాణా, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్‌రాజ్ బదిలీ అయ్యారు.

## సిద్దిపేటలో ప్రాజెక్టులు అడుగంటిపోతున్నాయి

హైదరాబాద్: నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ రాశారు. సిద్దిపేట జిల్లాలో ప్రాజెక్టులు నీళ్లు లేక అడుగంటిపోతున్నాయని అందులో పేర్కొన్నారు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లో నీళ్లు లేక అడుగంటిపోయే పరిస్థితికి



వచ్చాయన్నారు. గతేడాది ఆగస్టులో ఆయా జలాశయాల్లో నీటి నిల్వ ఉందని చెప్పారు. కానీ ప్రస్తుతం వీటిలో చాలా తక్కువ నీరు ఉందని తెలిపారు. వర్షాలు రాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని.. పంటలు వేయాలా? వద్దా? అనే సందిగ్ధం వారిలో నెలకొందని వివరించారు. మధ్య మానేరు నుంచి నీటిని పంపింగ్ చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని హరీశ్‌రావు కోరారు.

## కమలా హారిస్‌తో డిబేట్‌కు ఓకే.. డేట్ ఫిక్స్ చేసిన ట్రంప్

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో  అధికార డెమోక్రటిక్ పార్టీ తరపున కమలా హారిస్ అభ్యర్థిత్వం ఖరారైంది. ఈ నేపథ్యంలో ఆమెతో ముఖాముఖి చర్చ జరిపేందుకు రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిద్ధమయ్యారు. ఈ మేరకు ఫాక్స్‌న్యూస్ ఆఫర్‌ను ఆయన అంగీకరించారు. ఈవిషయాన్ని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతాలో తాజాగా వెల్లడించారు. వచ్చే నెలలో వీరి మధ్య డిబేట్ జరగనుంది. “సెప్టెంబరు 4న ఫాక్స్ న్యూస్ నిర్వహించే ఈవెంట్‌లో కమలా హారిస్‌తో డిబేట్ జరిపేందుకు అంగీకరించా. వాస్తవానికి ఇదే తేదీన ఏబీసీ ఛానల్‌లో జో బైడెన్‌తో నేను ముఖాముఖి చర్చలో పాల్గొనాల్సింది. అధ్యక్ష రేసు నుంచి ఆయన వైదొలగడంతో ఆ డిబేట్ రద్దయ్యింది. ఫాక్స్‌న్యూస్ డిబేట్ పెన్సిల్వేనియాలో జరుగుతుంది. బైడెన్‌తో జరిగిన చర్చలోని రూల్స్ అన్నీ దీనికి వర్తిస్తాయి. కానీ ఈసారి పూర్తిస్థాయిలో ప్రేక్షకులు కూడా ఉంటారు” అని ట్రంప్ వెల్లడించారు. అయితే.. ఈ డిబేట్, దాని కండీషన్స్‌కు హారిస్ అంగీకరించారా? లేదా అన్నది మాత్రం ఇంకా తెలియరాలేదు. ట్రంప్‌తో చర్చ గురించి ఆమె ప్రతినిధులు ఇంకా స్పందించలేదు. అయితే, ఆయనతో ముఖాముఖి చర్చకు తాను సిద్ధమేనని గతంలో కమలా హారిస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటికి ఆమె అభ్యర్థిత్వం ఖరారు కాకపోవడంతో ట్రంప్ దానిపై స్పందించలేదు. తాజాగా హారిస్ పోటీ ఖాయమవడంతో డిబేట్‌కు అంగీకరిస్తున్నట్లు మాజీ అధ్యక్షుడు పేర్కొన్నారు. కమలా హారిస్, ట్రంప్ మధ్య ముఖాముఖి చర్చ జరిగితే.. అది ఈ ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థుల మధ్య జరగనున్న రెండో డిబేట్ కానుంది. జూన్‌లో బైడెన్, ట్రంప్ మధ్య తొలి డిబేట్ జరిగిన సంగతి తెలిసిందే. ఆ చర్చకు ప్రేక్షకులను అనుమతించలేదు. ఆ డిబేట్ తర్వాతే బైడెన్ అభ్యర్థిత్వంపై సొంత పార్టీ నేతల నుంచి వ్యతిరేకత మరింత తీవ్రమైంది. దీంతో అధ్యక్ష రేసు నుంచి ఆయన వైదొలిగి కమలా హారిస్ పేరును ప్రతిపాదించారు.





## పోరాటాలు మాకు కొత్తేంకాదు.. బూతులు తిట్టినా.. అవమానించినా ప్రశ్నిస్తూనే ఉంటాం: కేటీఆర్

హైదరాబాద్: పోరాటాలు బీఆర్ఎస్‌కు కొత్తేంకాదని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని కేటీఆర్ అన్నారు. బూతులు తిట్టినా, అవమానించినా ప్రశ్నిస్తూనే ఉంటామని, నిలదీస్తూనే ఉంటామని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. ‘పోరాటం మాకు కొత్త కాదు. ప్రభుత్వం ఏర్పడ్డ ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు అని నమ్మించి రాహుల్ గాంధీ తెలంగాణ యువతను మోసం చేస్తున్న విధానం మీద అవసరమైతే ఢిల్లీకి వచ్చి మిమ్మల్ని ఎండగడతం. వదిలిపెట్టం, మీరు బూతులు తిట్టినా, అవమానించినా ప్రశ్నిస్తూనే ఉంటాం, నిలదీస్తూనే ఉంటాం. జై తెలంగాణ.. అంటూ తన అరెస్టుకు సంబంధించిన ఫొటోలను కేటీఆర్ షేర్ చేశారు.




## వయనాడ్ సహాయక చర్యల్లో పాల్గొన్న మోహన్‌లాల్..

వయనాడ్ ప్రమాద బాధితులకు సాయం చేసేందుకు హీరో మోహన్‌లాల్ స్వయంగా ముందుకొచ్చారు. శనివారం ఆయన టెరిటోరియల్ ఆర్మీ బేస్ క్యాంపునకు చేరుకున్నారు. టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా ఉన్న మోహన్‌లాల్.. విపత్తు ప్రాంతాన్ని సందర్శించి సైనికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ‘కొండచరియలు విరిగి పడిన ప్రాంతాలను ప్రత్యక్షంగా చూస్తుంటే ఈ ఘటన తీవ్రత అర్థమవుతోంది. ఆర్మీతో పాటు రెస్క్యూ బృందాలన్నీ అద్భుతంగా పనిచేస్తున్నాయి. ఇక్కడ ఉన్న విశ్వశాంతి ఫౌండేషన్‌లో నేనూ భాగమే. దాని తరఫున సహాయక చర్యల కోసం రూ. 3కోట్లు విరాళమివ్వాలని నిర్ణయించుకున్నా.

అవసరమైతే మరి కొంత సాయమైనా చేయడానికి సిద్ధంగా ఉన్నాను’ అని అన్నారు. కోజికోడ్ నుంచి రోడ్ మార్గంలో వయనాడ్‌కు వెళ్లి ఆర్మీ అధికారులతో చర్చలు జరిపారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి.దీ వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఎంతోమంది మృతిచెందడం యావత్ దేశాన్ని కలచివేస్తోంది. ఈ క్రమంలో బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు దేశవ్యాప్తంగా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ముందుకువస్తున్నారు. ఇప్పటికే పలువురు నటులు సీఎం రిలీఫ్ ఫండ్‌కు భారీ విరాళాలు ఇచ్చారు. తాజాగా కమల్‌హాసన్ రూ. 25లక్షలు విరాళం అందించారు. మరోవైపు ఆచూకీ గల్లంతైనవారిని గుర్తించడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఎక్కడెక్కడ ఎవరు చిక్కుకుపోయారో తెలుసుకునేందుకు డ్రోన్లు, రాడార్లు, మొబైల్ ఫోన్ల సిగ్నళ్ల ద్వారా ముమ్మర ప్రయత్నం కొనసాగుతోంది. ఇంకా వందలమంది ఆచూకీ లభ్యం కావాల్సి ఉంది.

## అబద్ధాల్లో రేవంత్ రెడ్డికి గిన్నిస్ రికార్డు ఇవ్వాలి.. వేముల ప్రశాంత్ రెడ్డి ఎద్దేవా



అసెంబ్లీలో బీర్ఎస్ గొంతు నొక్కారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. జీరో అవర్ మొత్తం ఎత్తివేశారని, ప్రశ్నోత్తరాలు లేకుండా చేశారని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సభలో చర్చలకు అవకాశం ఇవ్వలేదని.. ప్రజా సమస్యలపై మాట్లాడదామంటే మైకులు కట్టేశారని.. ఇదేంటని అడిగితే మార్షల్స్‌తో బయటకు తరలించారని మండిపడ్డారు. కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను తిట్టడానికే అసెంబ్లీని వినియోగించుకున్నారని వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. ఏడు నెలల్లోనే రేవంత్ రెడ్డి వికృతరూపం బయటపడిందని విమర్శించారు. రేవంత్ రెడ్డిది ప్రజాపాలన కాదు.. నియంతృత్వ పాలన అని ఎద్దేవా చేశారు. ఇంత అధ్వాన్నంగా సభ ఎప్పుడూ జరగలేదని అక్బరుద్దీన్ కూడా అన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ మిత్రపక్షమని చెబుతున్న ఎంఐఎం కూడా కాంగ్రెస్ తీరును తప్పుబట్టిందని తెలిపారు. రేవంత్ సభా నాయకుడిగా కాకుండా అటవిక రాజులా వ్యవహరించారని అన్నారు. సీఎం ఇష్టారాజ్యంగా సభను తప్పుదోవ పట్టించారని విమర్శించారు. ఏ చర్చపై కూడా పూర్తిగా మాట్లాడనివ్వలేదని అన్నారు. కేసీఆర్‌ను తిట్టుడు.. గత ప్రభుత్వంపై ఆరోపణలతోనే సభ నడించిందని అన్నారు. అసెంబ్లీని కౌరవ సభలా నడిపించారని వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. కళ్లున్న కబోధి రేవంత్ రెడ్డి అని విమర్శించారు. హామీలను అమలు చేయడమే లక్ష్యంగా తాము మాట్లాడామని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలు, 420 హామీల గురించి ఎక్కడా ప్రస్తావించలేదని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 8 నెలలైనా వంద రోజుల్లో అమలుచేస్తామన్న హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలను అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అబద్ధాలు చెప్పారని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎక్కడైనా ఉద్యోగాలు భర్తీ చేస్తారా అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగులను ఎంపిక చేస్తే.. ఈ ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఒప్పందంలో వ్యవసాయ మోటార్లకు మినహాయింపు ఉందని అన్నారు. ఆ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి తొక్కిపెట్టి తప్పుదోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాల్లో రేవంత్ రెడ్డికి గిన్నిస్ బుక్ రికార్డు ఇవ్వాలని ఎద్దేవా చేశారు.

## హైదరాబాద్ రావాలంటే భయపడుతున్న డ్రగ్స్ ముఠాలు..!



హైదరాబాద్: తెలంగాణలో పోలీసుల వరుస దాడులతో హైదరాబాద్ రావాలంటే డ్రగ్స్ ముఠాలు భయపడుతున్నాయి. డ్రగ్స్ కావాలంటే బెంగళూరు వచ్చి తీసుకెళ్లాలని ఈ ముఠాలు చెబుతున్నాయి. తెలంగాణ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో ఈ సంచలన విషయాలు వెల్లడయ్యాయి. మాదకద్రవ్యాల విక్రయాలు జరిపే సమయంలో ఈ ముఠా కనిపించకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. ఆన్‌లైన్లో డబ్బులు చెల్లిస్తే రెండు గంటల తర్వాత డ్రగ్స్ ఎక్కడ పెట్టారో వాట్సాప్ ద్వారా లొకేషన్ షేర్ చేస్తోంది. ఎవరికి అనుమానం రాకుండా చెత్త డబ్బాల్లో రెడ్ కలర్ కవర్‌లో.. చెట్టు కింది భాగంలో బ్లూకలర్ కవర్‌లో.. రోడ్డు పక్కనే ఉన్న బండ్ల కింద పెట్టి డ్రగ్స్ విక్రయాలు చేపడుతున్నారు. మాదకద్రవ్యాలు కొనే వారికి తమ ముఖం కనిపించకుండా ముఠా సభ్యులు జాగ్రత్తలు తీసుకుంటున్నారని అధికారులు తెలిపారు. బెంగళూరులో ఉన్న కింగ్ పిన్‌ను పట్టుకోవడానికి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెళ్లారు.

## పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు.. ఫైటర్‌జెట్లతో అమెరికా రెడీ

వాషింగ్టన్: ఇజ్రాయెల్ హమాస్ యుద్ధం, మధ్యలో హెజ్‌బొల్లా, ఇరాన్ జోక్యంతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. హమాస్ చీఫ్ హనియా హత్యకు ప్రతీకారంగా ఇరాన్, దాని మిత్రదేశాలు ఇజ్రాయెల్‌పై ఏ క్షణమైనా దాడి చేసే ముప్పు పొంచి ఉంది. దీంతో ఐడీఎఫ్ అప్రమత్తమైంది. మరోవైపు, టెల్ అవీవ్‌కు అండగా ఉండేందుకు అమెరికా రంగంలోకి దిగింది. పశ్చిమాసియాకు యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్లను పంపిస్తోంది. అమెరికా సిబ్బందితో పాటు ఇజ్రాయెల్ రక్షణ కోసం అదనపు యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్లను అగ్రరాజ్యం పంపించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. వీటితో పాటు బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యం కలిగిన అదనపు క్రూజర్లు, డిస్ట్రాయర్లను కూడా పంపించేందుకు పెంటగాన్ సన్నాహాలు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియా గత మంగళవారం ఇరాన్‌లో హత్యకు గురైన సంగతి తెలిసిందే. మరోవైపు హమాస్ సైనిక విభాగాధిపతి మహమ్మద్ డెయిఫ్‌ను హతమార్చినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇక, లెబనాన్‌లోని హెజ్‌బొల్లా సీనియర్ మిలిటరీ కమాండర్ ఫాద్ షుక్ర్ ఇజ్రాయెల్ జరిపిన దాడిలో మృతిచెందాడు. ఈ వరుస పరిణామాలతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఇప్పటికే ఇజ్రాయెల్ భూభాగం దిశగా లెబనాన్ పలు రాకెట్లను ప్రయోగించింది. మరోవైపు, హనియా హత్యకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై ప్రత్యక్ష దాడికి ఇరాన్ అగ్రనేత అయతుల్లా అలీ ఖమేనీ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. టెహ్రాన్‌తో పాటు తమ మిత్ర దేశాలన్నీ నలువైపుల నుంచి ఇజ్రాయెల్‌పై విరుచుకుపడాలని గత బుధవారం జరిగిన సమావేశంలో ఇరాన్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్.. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో మాట్లాడారు. దాడులు జరిగితే అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అమెరికా దళాలు ఇజ్రాయెల్‌కు రక్షణగా నిలిచాయి.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com